


ఉత్తమ అవార్డుల రగడ!



జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక వ్యవహారంపై తీవ్రస్థాయిలో రగడ నడుస్తోంది. ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరుకాని టీచర్‌ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడంపై భగ్గుమంటున్నారు. దొడ్డిదారిన ఎంపిక చేయడంతో పాటు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి ఎంపిక కోసం కూడా అతని పేరును పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపడంపై డీఈవో అధికారులను నిలదీస్తున్నారు. ఈ అంశంపై కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో వివాదాస్పదంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

14న టీచర్లను ఇంటర్వ్యూ చేసిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందం

- ఇంటర్వ్యూకు హాజరుకాని వ్యక్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక
- ఈ అంశంపై డీఈవో కార్యాలయ అధికారులతో టీచర్ల వాగ్వాదం
- విచారణకు ఆదేశించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి
- కోడూరు ఎంఈవో అక్రమాలపై మీకోసంలో ఫిర్యాదు


డీఈవో కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసేందుకు డీఈవో కార్యాలయ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ నెల 14వ తేదీన ఎంపిక చేసిన టీచర్‌లకు ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఇంటర్వ్యూలు నిర్వహించింది. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన స్కూల్ అసిస్టెంట్లు ఏడుగురు, సెకండరీ గ్రేడ్ టీచర్లు ఏడుగురిని ఎంపిక చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా డీఈవో కార్యాలయంలో అసలు ఇంటర్వ్యూకు హాజరు కాని ఒక టీచర్ పేరును జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కోసం గుట్టుచప్పుడు కాకుండా పంపారు. ఈ విషయం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై కొందరు ఉపాధ్యాయులు మిగతా 6లో..


తెరవెనుక ఏం జరిగింది?

ఇంటర్వ్యూలకు హాజరు కాని టీచర్‌ను ఏకంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో పేరు చేర్చడమే కాకుండా, రాష్ట్ర స్థాయి అవార్డు కోసం పంపడంలో తెరవెనుక నగదు పెద్దమొత్తంలో చేతులు మారిందని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఓ మండలానికి చెందిన విద్యాశాఖాధికారి ఇంటర్వ్యూ జరిగిన రోజు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో రాత్రి తొమ్మిది గంటల వరకు ఉండి ఈ వ్యవహారం నడిపించారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. డీఈవోకు తెలియకుండా ఈ జాబితాల తయారీ జరగలేదని కూడా అంటున్నారు. జిల్లాలోని ఒక మోడల్ పాఠశాలలో పనిచేసే టీచర్‌కు రావాల్సిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును పక్కదారి పట్టించేందుకు, ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాలో పేర్లు మార్పు చేశారని పలువురు టీచర్‌లు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై కలెక్టర్ విచారణకు ఆదేశించాలని కోరుతున్నారు.

మండల విద్యాశాఖ అధికారిపై ఫిర్యాదు

కోడూరు ఎంఈవోపై పలువురు ఉపాధ్యాయులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు ఎంఈవో చేస్తున్న అక్రమాలపై సాక్ష్యాధారాలతో 150 పేజీల బుక్‌లెట్‌ను అందజేశారు. తనకు అనుకూలమైన ఉపాధ్యాయులు ఐదారు నెలల పాటు పాఠశాలలకు రాకున్నా జీతాల బిల్లులు చేశారని ఆరోపించారు. ఈ ఎంఈవోనే గతేడాది, ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలోనూ చక్రం తిప్పుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదరు ఎంఈవోపై విచారణ చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

వైద్యం చేస్తున్న డాక్టర్ ఆళ్ల రామశేషయ్య



రూపాయికే వైద్యం

కానూరులోని కంటి డాక్టర్ ఆళ్ల రామశేషయ్య ఔదార్యం

సుమారు 30 ఏళ్లుగా పేదలకు వైద్య సహాయం

- మొదట్లో రూ.5కే.. ఇప్పుడు రూపాయికే కన్సల్టెన్సీ
- అవయవదానంపై రోగులకు అవగాహన
- చనిపోయిన కుమారుడి పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవ
- తన శరీరాన్ని ప్రభుత్వాసుపత్రికి దానం చేస్తూ వీలునామా
- రూపాయి కంటి డాక్టర్‌గా ప్రత్యేక గుర్తింపు

వైద్యం వ్యాపారమైన ఈరోజుల్లో రూపాయికే వైద్యం చేయడమంటే మామూలు విషయం కాదు. ఆర్థిక పరిస్థితులతో పాటు అంతకుమించిన సంకల్పబలం ఉండాలి. చిన్న జ్వరానికే వేలల్లో ఫీజులు గుంజుతున్న ప్రైవేట్ ఆసుపత్రులను చూసి భయపడి పోతున్న రోగులకు నేనున్నానంటూ భరోసా ఇస్తూ రూపాయికే కంటి వైద్యం చేస్తున్నారు డాక్టర్ ఆళ్ల రామశేషయ్య. కన్నకొడుకు చనిపోయినా ఆ బాధను గుండెల్లో దాచుకుంటూ కళ్లను దానంచేసి వృత్తిపట్ల నిబద్ధతను చాటుకోవడంతో పాటు మరణాంతరం శరీరాన్ని ప్రభుత్వాసుపత్రికి దానం చేసి.. అవయవదానంపై రోగులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గుడివాడ సమీపంలోని తమిరిశ గ్రామానికి చెందిన ఆళ్ల రామశేషయ్య ఉన్నత కుటుంబంలో జన్మించారు. చిన్నతరంలో తమ పొలంలో పనులకు వచ్చిన కూలీల పిల్లలతో ఆయన స్నేహం చేసేవారు. వారి పేదరికాన్ని చూసి చలించిపోయేవారు. ఎవరికీ తెలియకుండా స్నేహితులకు ధాన్యాన్ని దానం మిగతా 6లో..

పోరంకిలో స్మార్ట్ రైస్ కార్డు అందజేసి మహిళతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పారదర్శకంగా నిత్యావసరాల సరఫరా

మంత్రి నాదెండ్ల మనోహర్

పోరంకిలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ప్రారంభం

పెనమలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల ద్వారా పారదర్శకంగా నిత్యావసరాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం పోరంకి బీజేఆర్ నగర్‌లో మంత్రి మనోహర్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం పోరంకి డీలర్ సీహెచ్.దుర్గారాణి చౌక దుకాణాన్ని తనిఖీ చేసి, అందులోని స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత పౌర సరఫరాల శాఖలో అనేక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో కొత్తగా కోటి 46 లక్షల గృహాలకు గాను 4.42 కోట్ల స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ మిగతా 6లో..

విజయం ఎవరిది?

విజయ డెయిరీలో ఎన్నికల కోలాహలం

- మూడు డైరెక్టర్ల పోస్టులకు 5 నామినేషన్లు
- పరిశీలన అనంతరం మిగిలినవి 4
- మహిళా కేటగిరీ ఏకగ్రీవం అయినట్టే..
- జనరల్ కేటగిరీ డైరెక్టర్ల ఎన్నికపై ఉత్కంఠ
- నామినేషన్ల ఉపసంహరణకు గడువు నేడు


నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందిస్తున్న వెంకట నగేశ్, వాణిశ్రీ. పక్కనే పలువురు డైరెక్టర్లు

చిట్టినగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విజయ డెయిరీలో ఎన్నికల సందడి మొదలైంది. కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సమితి (విజయ డెయిరీ) పాలకవర్గంలో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ల పోస్టులకు (జనరల్-2, మహిళా కేటగిరీ-1) సోమవారం పాలఫ్యాక్టరీలోని క్షీరదర్శన్ హాల్లో ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఎల్.గురునాథం 5 నామినేషన్లను పరిశీలించి, ఒక నామినేషన్‌ను వివిధ కారణాలతో తిరస్కరించారు. 4 నామినేషన్లు మిగిలాయి. పెడనలోని పెనుమల్లికి చెందిన అర్జా వెంకట నగేశ్, వత్సవాయిలోని భీమవరానికి చెందిన ఇంజం రామారావు, తిరువూరులోని ముష్టికుంటకు చెందిన గద్దె రంగారావు, విస్సన్నపేటకు చెందిన నెక్కళపు వాణిశ్రీ, తిరువూరులోని చిట్టేలకు చెందిన బోయపాటి సుశీల నామినేషన్లు ఇవి. బోయపాటి సుశీల నామినేషన్ వివిధ కారణాలతో తిరస్కరణకు గురైంది. దీంతో మహిళా కేటగిరీకి సంబంధించి ఒకే నామినేషన్ మిగలడంతో దాదాపు ఏకగ్రీవం అయినట్టే.

ఏకగ్రీవమా? ఎన్నికా?

జనరల్ కేటగిరీలో రెండు డైరెక్టర్ల పోస్టులకు మూడు నామినేషన్లు మిగిలాయి. మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ముగ్గురిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకుంటే ఎన్నిక ఏకగ్రీవం అవుతుంది. జనరల్ కేటగిరీలో ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే సాయంత్రం 5 గంటల తరువాత ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. సెప్టెంబరు 2న ఎన్నికలు నిర్వహిస్తారు. జిల్లాకు చెందిన 375 సొసైటీ అధ్యక్షులు ఓటుహక్కు వినియోగించుకుని డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఏదిఏమైనా మంగళవారం సాయంత్రానికి ఏకగ్రీవమా, ఎన్నికా అనేది తేలిపోతుంది. నామినేషన్ల కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, వేమూరి సాయి వెంకటరమణ, చలసాని చక్రపాణి, ఎస్.నాగేశ్వరరావు, శనగల శివజ్యోతి, ఎం.వెంకటలక్ష్మి, పాలడుగు వెంకటరామ వరప్రసాద్, వల్లగాని కొండలరావు, బొట్టు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం సాయంత్రం వరకు గడువు ఉందని, ఆ తరువాత జనరల్ కేటగిరీకి ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే సెప్టెంబరు 2న ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (రిటైర్డ్) ఎల్.గురునాథం చెప్పారు.

హోంగార్డుపై జనసేన కార్యకర్త దాడి

మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలింపు

నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

మచిలీపట్నం/మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నైట్ బీట్‌లో ఉన్న హోంగార్డుపై దాడి చేసిన జనసేన కార్యకర్త కర్రి మహేష్‌పై మచిలీపట్నం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని విశ్వబ్రాహ్మణ కాలనీలో ఆదివారం రాత్రి కానిస్టేబుల్ బాషా, హోంగార్డు మోహనరావు నైట్‌బీట్ డ్యూటీ చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో బీట్ పుస్తకంలో సంతకం చేసేందుకు ఒక ఇంటి వద్ద నిలబడి ఉన్నారు. ఈ సమయంలో అటుగా వచ్చిన విశ్వబ్రాహ్మణకాలనీ జనసేన ఇన్‌చార్జి కర్రి మహేష్ వారిని ఇక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నించాడు. నైట్‌బీట్ డ్యూటీలో ఉన్నామని కానిస్టేబుల్ చెప్పగా, వారితో మహేష్ వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా మిగతా 6లో..

అధికార భాషా సంఘానికి మండలి పేరు ఖరారు

జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం


మండలి వెంకట కృష్ణారావు(ఫైల్)

అవనిగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, దివిసీమ గాంధీగా పేరొందిన మండలి వెంకట కృష్ణారావు పేరును రాష్ట్ర అధికార భాషా సంఘానికి పెడుతూ మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాన్ని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. ఈ నెల 4న విజయవాడలో జరిగిన మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అధికార భాషా సంఘం పేరును మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘంగా మారుస్తామని ప్రకటించారు. దీనిపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ జీవో నంబరు 25 విడుదల చేశారు. ఇకపై రాష్ట్ర అధికార భాషా సంఘం పేరును 'మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం'గా మారుస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘం కార్యకలాపాలు అన్నింటినీ అదే పేరుతో నిర్వహించాలని జీవోలో స్పష్టం చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు కాల్ లెటర్లు నేడు

- మధ్యాహ్నం నుంచి సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు
- 28 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- డీఈవో పి.వి.జె.రామారావు



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ఉద్యోగ నియామక ప్రక్రియ వేగవంతమైనట్లు డీఈవో పి.వి.జె.రామారావు సోమవారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి అభ్యర్థుల సెల్‌ఫోన్లకు కాల్ లెటర్లు వస్తాయన్నారు. మెరిట్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 28 ఉదయం 9 గంటల నుంచి నోబుల్ కళాశాలలో జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే నోబుల్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. జిల్లా పరిశీలకుడిగా సమగ్ర శిక్ష అధికారి ప్రసన్నకుమార్ హాజరవుతున్నారని వివరించారు.

97 రహదారులు ధ్వంసం

భారీ వర్షాల కారణంగానే..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో 97 ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయి. విజయవాడ, మచిలీపట్నం, నైలవరం డివిజన్లలో దెబ్బతిన్న రోడ్ల వివరాలను ఆర్అండ్‌బీ జిల్లా అధికారులు సేకరించారు. రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేసేందుకు రూ.33.08 కోట్లు అవసరమని, శాశ్వతంగా రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.251.37 కోట్లు అవసరమని పేర్కొంటూ జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆయా ప్రాంతాల వివరాలను పొందుపరిచారు.

విఘ్నేశ్వరుని పల్లెబాట


వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లోని చలువ పందిళ్లలో తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకొనేందుకు బొజ్జ గణపయ్య పల్లెబాట పట్టాడు. సోమవారం వలందపాలెం నుంచి విగ్రహాలను ఇలా తరలించారు. 6

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

- కలెక్టర్ బాలాజీ

8లో

సెప్టెంబరులో పట్టాభి స్మారక భవనానికి శంకుస్థాపన

6లో

- మొదటి విడతగా రూ.6.5 కోట్లు : ఎంపీ బాలశౌరి


అమ్మవారి ప్రధాన ఆలయం గోడకు రంగులు వేస్తున్న సిబ్బంది

వేగంగా దసరా ఏర్పాట్లు

- భక్తులకు లడ్డూ ప్రసాదం కొరత లేకుండా పోటు భవనంలో గాటు పొయ్యిలు
- గత అనుభవాల దృష్ట్యా ప్రణాళికా బద్ధంగా పనులు
- ప్రధాన ఆలయం, ఉపాలయాలు రంగులతో ముస్తాబు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సెప్టెంబరు 22నుంచి ప్రారంభం కానున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఈవో వీకే శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, రాంబాబుల ఆధ్వర్యంలో దసరా పనులను వేగవంతం చేశారు. కేశ ఖండనశాల ఎదురుగా క్యూ ఏర్పాట్లు, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, లడ్డూప్రసాదం


గాటు పొయ్యిలు

కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ముందుగానే తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దసరా ఉత్సవాలలో రోజుకు లక్ష నుంచి లక్షన్నర, మూలా నక్షత్రం రోజున సుమారు రెండున్నర లక్షల లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉండేలా అధికారులు మహామండపం ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ పోటు భవనం మొదటి అంతస్తులో గాటు పొయ్యిల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శృంగేరి మఠం పక్కన రేకుల షెడ్డు, బుద్దా


ఎలివేటెడ్ క్యూల నిర్మాణం

వారి గుడి కళ్యాణ మండపంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ పోటు భవనంలో కూడా లడ్డూలు తయారు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియపరిచేందుకు అర్జునవీధి ప్రారంభంలో ప్రత్యేక రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు వారం రోజుల్లో పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం రంగులతో అలంకరిస్తున్నారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, ఆలయ పరిసర ప్రాంతాలను ముస్తాబు చేస్తున్నారు. దుర్గాఘాట్, కొండపైన, ఘాట్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో పనులను ముమ్మరంగా చేస్తున్నారు.


కుటుంబసభ్యులతో పీహెచ్‌సీ ఆయా చిరంజీవి

పీహెచ్‌సీ ఆయా ఆచూకీ లభ్యం

జి.కొండూరు : స్థానికంగా సంచలనం రేపిన జి.కొండూరు పీహెచ్‌సీ ఆయా మంద చిరంజీవి మిస్సింగ్ కథ సుఖాంతమయ్యింది. ఈనెల 20న డ్యూటీ ముగించుకొని సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసి ఎటో వెళ్లిపోయిన ఆమె ఆచూకీని ఆరురోజుల తర్వాత పోలీసులు కనుగొన్నారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా వి.ఎం బంజర్ వద్ద ఆమె ఆచూకీని పోలీసులు సోమవారం కనుగొన్నారు. ఆమెను జి.కొండూరు తీసుకువచ్చి తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావు ఎదుట పోలీసులు హాజరుపరిచారు. 30 ఏళ్లుగా ఆసుపత్రిలో పనిచేస్తున్నా తనకు జీతం పెంచడంలేదనే మనస్తాపంతో వెళ్లిపోయానని, యూడీసీ, మరెవరూ తనను వేధించలేదని చిరంజీవి అధికారులకు వివరణ ఇచ్చినట్టు మైలవరం సీఐ చంద్రశేఖర్ తెలిపారు. చిరంజీవి ఆచూకీ లభ్యం కావడంతో ఆమె కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

బస్‌స్టేషన్‌లో 5 కేజీల గంజాయి స్వాధీనం

బస్‌స్టేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు గంజాయి తరలించటానికి ప్రయత్నించిన జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఎండీ రిజ్వాన్ అలామ్ (37)ను విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో కృష్ణలంక పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. బస్‌స్టేషన్‌లో హైదరాబాద్ వెళ్లే బస్సులో ఓ మహిళ వద్ద రూ.25వేలు మాయం అయ్యాయి. విధుల్లో ఉన్న కంట్రోలర్, బస్‌స్టేషన్‌లో కృష్ణలంక పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు, కంట్రోలర్ బస్సులోని ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తుండగా జార్ఖండ్ రాష్ట్రం ఇచ్చాక్ జిల్లా, మదనపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ రిజ్వాన్ అలామ్ బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో గంజాయి బండిల్స్ లభించాయి. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిసా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నట్టు వెల్లడైంది. పోలీసులు నిందితుడి వద్ద సుమారు 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్టీసీ కంట్రోలర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిడుమోలులో రూ.3 లక్షల ఎరువుల సీజ్

కూచిపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నిడుమోలు గ్రామంలో సుమేధ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.2,91,000 విలువ గల ఎరువులను సీజ్ చేసినట్టు మండల వ్యవసాయశాఖాధికారి సురేష్‌బాబు నాయక్ తెలిపారు. రికార్డులకు, సరుకు నిల్వకు మధ్య వ్యత్యాసం తనిఖీల్లో తేటతెల్లమైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మోనియం సల్ఫేట్ 192 బస్తాలు, 151515 కాంప్లెక్స్ ఎరువు 82 బస్తాలను అధికారులు సీజ్ చేశారు. సంబంధిత విషయాలను జేసీ కోర్టులో ఫిర్యాదు చేసినట్టు ఏవో తెలిపారు. విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు నేతృత్వంలో ఈ దాడులు నిర్వహించారు.

ఉత్తమ అవార్డుల రగడ!

(5వ పేజీ తరువాయి)

డీఈవో కార్యాలయానికి వచ్చి డీఈవోను ప్రశ్నించారు. దీంతో డీఈవోకు, ఉపాధ్యాయులకు మధ్య ఈ అంశంపై తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. అయినా ఉపాధ్యాయులు ఈ అంశాన్ని విడిచి పెట్టకుండా గత రెండు, మూడు రోజులుగా డీఈవో కార్యాలయానికి వచ్చి నిలదీస్తూనే ఉన్నారు. దీంతో ఉపాధ్యాయుల నుంచి ఒత్తిడి అధికం అయ్యింది. సంబంధిత ఫైల్‌ను బయటపెడితే తెర వెనుక జరిగిన వ్యవహారం వెలుగులోకి వస్తుందని డీఈవో కార్యాలయ అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. చివరకు డీఈవో కార్యాలయ అధికారులు ఈ ఫైల్ కనపడటం లేదని తేల్చి చెప్పడంతో ఈ అంశం ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. డీఈవో కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో జరిగిన అవకతవకలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆరా తీయడంతో డీఈవో కార్యాలయ అధికారులు ఈ అంశాన్ని తొక్కిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఉపాధ్యాయులు చెప్పుకుంటున్నారు.

పోస్టల్ సేవలు వేగవంతం

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఐటీ 2.0)తో రిజిస్టర్, స్పీడ్ పోస్ట్, ఎకౌంట్స్, ఇన్సూరెన్స్ సేవలు సులభతరం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)

అందుబాటులోకి వచ్చిన అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీ(ఏపీటీ) 2.0 పోస్టల్ సేవలను మరింత సులభతరం చేస్తోంది. గతంలో ఉన్న సీఎస్ఐ, ఎస్ఏపీ స్థానే తీసుకొచ్చిన ఈ సాంకేతికత ఉద్యోగులకు పనిభారాన్ని తగ్గించి, ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించడంతో పాటు జవాబుదారీ తనాన్ని పెంచుతున్నాయి. రిజిష్టర్ పోస్ట్, స్పీడ్ పోస్ట్, పార్శిల్ వేగాన్ని పెంచుతూనే.. మరోవైపు పోస్టల్ కార్యాలయాల అకౌంటబలిటీ, పోస్టల్ ఇన్సూరెన్స్ సేవలను విస్తృతం చేస్తున్నాయి. గతనెల 22 నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని బ్రాంచి, సబ్, హెడ్ పోస్టాఫీస్‌లకు ఈ సాఫ్ట్‌వేర్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ సేవల దిశగా అడుగులు వేస్తున్న పోస్టల్ శాఖకు ఏపీటీ 2.0 సాఫ్ట్‌వేర్ ఓ వరమని ఉద్యోగులు, ప్రజలు భావిస్తున్నారు.

- పోస్ట్ బుక్‌చేసిన వెంటనే అందుకునే వ్యక్తికి సమాచారం

రిజిష్టర్, స్పీడ్‌పోస్ట్, పార్శిల్ అందుకునే వరకు పోస్ట్ వచ్చిందనే విషయం గతంలో తెలిసేది కాదు. ఏపీటీ 2.0 సాఫ్ట్‌వేర్ ఆ గీతను చెరిపేసింది. పోస్ట్ బుక్‌చేసిన వెంటనే బ్రాంచి, సబ్, హెడ్ పోస్టాఫీసులోని ఉద్యోగులు సదరు కవరును తూకం వేస్తారు. ఆ వెంటనే ఏపీటీ 2.0 సాఫ్ట్‌వేర్‌లో పోస్ట్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేస్తారు. పోస్ట్ వేసేవ్యక్తి పేరు, ఫోన్ నెంబర్, అతని చిరునామా, ఎక్కడి నుంచి పోస్ట్ చేస్తున్నారనే సమాచారంతో పాటు, పోస్ట్ ఎవరికి చేరాలి, అందుకునే వ్యక్తి పేరు, ఫోన్ నెంబర్‌ను కంప్యూటర్‌లో ఎంటర్ చేస్తారు. దీంతో వెంటనే పోస్ట్ అందుకోవాల్సిన వ్యక్తి మొబైల్‌కు పోస్ట్‌కు సంబంధించిన మెసేజ్ వెళుతుంది. మధ్యాహ్నం ఒకసారి, సాయంత్రం ఒకసారి, రాత్రి ఒకసారి పార్శిల్స్‌ను ఆర్ఎంఎస్(రైల్వే మెయిల్ సర్వీస్)కు పంపిస్తున్నారు. దీనికారణంగా సర్వీసు వేగంగా గమ్యానికి చేరుతుంది. గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు అదేరోజు పోస్ట్ చేరుతుంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు 24 గంటల లోపు పోస్ట్ చేరుతుంది. ఇతర రాష్ట్రాలకు రెండురోజుల్లో పోస్ట్ చేరుతుందని ఉద్యోగులు చెబుతున్నారు.



నగదు లావాదేవీలు

పారదర్శకం

బ్రాంచి పోస్టాఫీసుల నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకు ఆ రోజు జరిగిన లావాదేవీలను ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ సులభతరం చేసింది. మాన్యువల్ పద్ధతిలో రికార్డుల పరిశీలన బ్రాంచ్ పోస్టాఫీస్ నుంచి హెడ్ పోస్టాఫీస్ వరకు రెండు రోజులకు పైబడి కొనసాగేది. అత్యాధునిక సాంకేతకతలో ఒకే రోజులో అన్ని కార్యాలయాల అకౌంట్స్ తేలిపోతున్నాయి. ఆ రోజు ఎన్ని లావాదేవీలు జరిగాయి.. ఎంత నగదు వచ్చింది.. ఎన్ని పోస్టులు చేశారనే విషయాలు ఎప్పటికప్పుడే తెలిసిపోతున్నాయి. బ్రాంచ్, సబ్‌పోస్టాఫీసుల్లో జరిగే లావాదేవీలను హెడ్ పోస్టాఫీసుల్లో ఉన్నత ఉద్యోగులు నేరుగా పరిశీలిన చేసే వెలుసుబాటును ఈ సాంకేతికత సమకూర్చింది.

ఇన్సూరెన్స్ సేవలు సులభతరం

మెకామిష్ సాఫ్ట్‌వేర్ పీఎల్ఐ, ఆర్పీఎల్ఐ తదితర పోస్టల్ ఇన్సూరెన్స్ సేవలతో పాటు సేవింగ్ ఖాతాల లావాదేవీలు, ఆర్డీ, టీడీ, సుకన్య సమృద్ధి, సీనియర్ సిటిజన్ అకౌంట్ తదితర పోస్టల్ సేవలను పరుగులు పెట్టిస్తోంది. ఖాతాదారులు క్యూలో నిలబడే అవసరం లేకుండా లావాదేవీలు చకాచకా జరిగిపోతున్నాయి. ఖాతాదారుడి వేలిముద్ర వేయగానే ఖాతాకు సంబంధించిన వివరాలు డెస్క్‌టాప్‌పై ప్రదర్శించబడుతున్నాయి. దీంతో నగదు తీసుకోవడం, జమ చేయడం వంటివి చురుగ్గా సాగిపోతున్నాయి.

బీఎస్ఎన్ఎల్‌తోనే తంటా

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ కారణంగా తరచూ సర్వర్ నెమ్మదిస్తుందని పోస్టల్ ఉద్యోగులు చెబుతున్నారు. నెట్ స్పీడ్ తక్కువగా ఉంటుందని, ఒక్కో సమయంలో నెట్ ఆగిపోతుందంటున్నారు. దీనికారణంగానే ప్రజలు వేచిఉండాల్సి వస్తుందని, నెట్ సక్రమంగా పనిచేస్తే సేవలు మరింత స్పీడ్‌గా అందిస్తామని చెబుతున్నారు.

పట్టాభి స్మారక భవనానికి గ్రీన్‌సిగ్నల్!

- మొదటివిడతగా రూ.6.5 కోట్లు
- సెప్టెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు
- హాజరుకానున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్
- అంబేడ్కర్ భవనానికి రూ.10 కోట్లు మంజూరు
- గుడివాడ-కంకిపాడు మధ్య జాతీయ రహదారి
- రాజధాని అమరావతి-మచిలీపట్నం పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు ప్రణాళిక
- మచిలీపట్నం-రేపల్లె రైలు మార్గానికి గ్రీన్ సిగ్నల్
- ఎంపీ వల్లభనేని బాలశౌరి వెల్లడి


మాట్లాడుతున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు పట్టాభిసీతారామయ్య స్మారక భవనానికి వచ్చే నెలలో శంకుస్థాపన చేస్తామని, కార్యక్రమానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ హాజరుకానున్నట్టు బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు. సోమవారం ఎంపీ మచిలీపట్నంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నాలుగేళ్లక్రితం పట్టాభిసీతారామయ్య స్మారక భవనానికి స్థలం సమకూర్చామని, యూనియన్ బ్యాంక్ పట్టాభి స్మారక భవనానికి నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. అయితే మునిసిపల్ కౌన్సిల్ భవన నిర్మాణానికి ఎన్‌వోసీ ఇవ్వనందున నిర్మాణం చేపట్టలేకపోయామన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, బ్యాంకింగ్ సెక్రటరీ నాగరాజు, యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులతో చర్చించగా భవన నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. తొలి విడతగా రూ.6.5 కోట్లతో భవన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. రెండో విడతలో ఆడిటోరియంతో పాటు యూనియన్ బ్యాంకు రీజనల్ ఆఫీస్ నిర్మాణాలు జరుగుతాయన్నారు. పట్టాభి సీతారామయ్య బంధువులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. భవన నిర్మాణానికి ఎన్‌వోసి నిమిత్తం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడామన్నారు. పట్టాభిస్మారక భవనం పక్కన ఉన్న అంబేడ్కర్ భవనం శిథిలమైందని, నూతనంగా నిర్మించడానికి రూ.10 కోట్లు మంజూరు చేశామన్నారు. గుడివాడ-కంకిపాడు మధ్య 25 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. పీఎం గతిశక్తి కింద నిర్మించనున్న రోడ్డు గుడివాడ నుంచి నాగవరప్పాడు, ఎంట్రప్రగడ, దోసపాడు మీదుగా నిర్మిస్తారని, ఈ ప్రాంతాల్లో పొలాలు ఇచ్చే రైతులకు తగిన పరిహారం ఇస్తామన్నారు. మచిలీపట్నం-విజయవాడ మధ్య ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మిస్తామన్నారు. ఏడాదిలో బందరు పోర్టు నిర్మాణం పూర్తి కానున్నదన్నారు. బందరు పోర్టు నుంచి జాతీయ రహదారిని కలిపే రోడ్డు 18 కిలోమీటర్ల జాతీయ రహదారి, మూడు అండర్‌పాస్‌లు, మూడు ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి అమరావతికి జాతీయ రహదారి నిర్మిస్తున్నారని, అదే రోడ్డును మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తున్నామన్నారు. దీనివల్ల అభివృద్ధికి అవకాశాలు ఏర్పడతాయన్నారు. మచిలీపట్నం- రేపల్లె రైలుమార్గం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు. మచిలీపట్నం నుంచి తిరుపతి రైలును పునరుద్ధరిస్తామన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన పాలక వర్గం

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

- పామర్రు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ బాలశౌరి, వర్ల రామయ్య


వేదికపై ఎంపీ బాలశౌరి, వర్ల రామయ్య , రావి తదితరులు

పామర్రు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆశయసాధనకు అనుగుణంగా నూతనంగా ఎంపికైన రైతు అనుబంధ పాలకవర్గాలు రైతులకు విస్తృత సేవలందించాలని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యుడు వర్లరామయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం పామర్రు వ్యవసాయ మార్కెట్ యార్డు నూతన కమిటీ చైర్మన్‌గా జన్నుశోభనబాబుతోపాటు పాలకవర్గసభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో వారు మాట్లాడుతూ, నూతన పాలకమండలి రైతులకు సంక్షేమ పథకాలను సకాలంలో అందేంచేందుకు కృషి చేయాలన్నారు. నూతన కమిటీలో అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నూతన కమిటీ చైర్‌పర్సన్‌గా జన్నుశోభన్‌బాబు, వైస్‌చైర్మన్ చిలకా ఆంజనేయులు, గౌరవచైర్మన్‌గా ఎమ్మెల్యేకుమార్‌రాజాతో పాటు మరో 17మంది పాలక వర్గసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రూపాయికే వైద్యం

(5వ పేజీ తరువాయి)

చేసేవారు. ఈ విషయంలో తండ్రి మందలించినా.. తల్లి కొడుకులోని సేవాగుణాన్ని మెచ్చుకునేవారు. నాటి నుంచి తల్లి కళ్లలో ఆనందం కోసం, తన ఆత్మసంతృప్తి కోసం పేదలకు ఏదో రూపంలో సేవ చేయాలని నిర్ణయించుకున్నారు రామశేషయ్య. ప్రాథమిక విద్య తమిరిశలో, 1961లో ఎస్ఎల్‌సీసీ (10+2) ఈడుపుగల్లులో పూర్తిచేసి, లయోలా ప్రీ యూనివర్సిటీలో ఒక ఏడాది కోర్సు పూర్తిచేశారు. 17 ఏళ్లకే పెళ్లి చేసుకున్నారు. అనంతరం గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేసి 1969లో ఏటీ అగ్రహారంలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ప్రాక్టీస్ సమయంలోనే ఎలాంటి ఫీజు వసూలు చేయకుండా బయట ఒక డబ్బా ఏర్పాటుచేసి అందులో ఎవరికి తోచినంత డబ్బు వేయాలని చెప్పేవారు. ఆ విధంగా వచ్చిన మొత్తాన్ని పేదల వైద్యానికి ఉపయోగించేవారు.

1973 నుంచే రూ.5కే వైద్యం

గుంటూరు మెడికల్ కాలేజీలో 1969-73లో ఎంఎస్ పూర్తిచేసి పేదలకు ఐదు రూపాయలకే కంటి వైద్యం చేయడం ప్రారంభించారు. అప్పట్లో ఆసుపత్రుల్లో ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోవడం, బయట భవనాలు తీసుకునే స్థోమత లేకపోవడంతో పేద రోగులకు ఇంట్లోనే కంటి ఆపరేషన్ చేసేవారు. కటిక పేదరికంతో తన వద్దకు వచ్చే రోగులకు దుస్తులు, వృద్ధులకు చేతికర్రలు, చెప్పులు సాయం చేసేవారు. డాక్టర్‌గా సేవలందించడమే కాకుండా ఎన్నో దానధర్మాలు చేశారు. ఆయన సేవలను గుర్తించిన రోటరీ క్లబ్ 1974లో సర్వీస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించింది. నాటి నుంచి ప్రతి పల్లెకు సైకిల్‌పై తిరుగుతూ రచ్చబండ వద్ద కంటి ప్రాధాన్యత వివరించడమే కాకుండా అక్కడే వైద్య పరీక్షలు నిర్వహించేవారు. 1979లో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటివరకు సుమారు 70 వేల మందికి ఉచితంగా సేవలందించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో లంబాడీల బాధలను చూసి ఆయన చలించిపోయారు. ఇద్దరు, ముగ్గురు ఆడపిల్లలు పుట్టిన దంపతుల నుంచి కనీసం ఒకరిని దగ్గరలోని మిరియం అనాథ ఆశ్రమంలో చేర్పించేవారు. వారికయ్యే ఖర్చును భరించేవారు. అనాథాశ్రమానికి తన వంతుగా గదులు, పాఠశాల భవనాలు నిర్మించారు. సుమారు 30 మంది ఆడపిల్లల పేరిట రూ.5 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వారిలో చాలామందికి సొంతఖర్చుతో పెళ్లిళ్లు చేశారు. అనంతరం కానూరులోని ఆటోనగర్ రోడ్డులో శ్రీఅమరావతి కంటి ఆసుపత్రిని ఏర్పాటుచేసి రూపాయి కన్సల్టెన్సీ ఫీజుకే వైద్యం చేయడం ప్రారంభించారు. చిన్నచిన్న ఆపరేషన్లను సైతం ఉచితంగా చేస్తున్నారు.

అమ్మ సంతోషం కోసం.. : డాక్టర్ ఆళ్ల రామశేషయ్య

సర్వేంద్రియానాం నయనం ప్రధానమన్నారు పెద్దలు. అదే విభాగంలో వైద్యవృత్తి చేస్తున్న నేను నా వృత్తిని అమ్ముకోదలచుకోలేదు. చిన్నతనం నుంచి మా అమ్మ ఏ మంచిపని చేసినా ప్రోత్సహించేది. ఎవరికైనా సహాయం చేసిన రోజు మనసుకు చాలా ఆనందంగా ఉండేది. ఎంతోమంది పేదలు చికిత్స చేయించుకోలేక కళ్లు పోగొట్టుకుంటున్నారు. మా పెద్ద బ్బాయి అజయ్ 1987లో చనిపోయాడు. అతని పేరుమీద అజయ్ జ్యోతి రూరల్ ఐ ట్రస్ట్ నడుపుతున్నాను. అనేకమంది పేదలు చికిత్సకు వచ్చిన సమయంలో బట్టలు లేకుండా రావడం బాధ కలిగించింది. నాటి నుంచి వైద్యంతో పాటు మగవారికి చొక్కాలు, మహిళలకు చీరలు పంచుతున్నాను. మా బంధువుల నుంచి దుస్తులు సేకరిస్తున్నప్పుడు పేదలు తీసుకోరని చెప్పేవారు. నాకు కూడా అలాగే అనిపించింది. మొదట్లో ఇవ్వడానికి భయపడ్డా. ఇవ్వడం మొదలుపెట్టాక ఎవరూ కాదనలేదు. నా మరణం తరువాత నా శరీరం వృథా కాకూడదు. అందుకే ప్రభుత్వాసుపత్రికి దానం చేస్తున్నా.





విఘ్నేశ్వరుని పల్లెబాట

గ్రామాల్లోని చలువ పందిళ్లలో కొలువుతీరేందుకు విఘ్నేశ్వరుడు పల్లెబాట పట్టాడు. మచిలీపట్నం వలందపాలెం నుంచి జిల్లా వ్యాప్తంగా విగ్రహాలు తరలివెళ్తున్నాయి. ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో కళాకారులు నాలుగు నెలలు కష్టపడి రెండు వేల విగ్రహాలు తయారు చేశారు. అడుగు సైజు నుంచి 10 అడుగుల సైజు వరకు అందుబాటులో ఉంచారు. కైకలూరు, గుడివాడ, గుడ్లవల్లేరు ప్రాంతాల నుంచి వచ్చిన వారు లారీలు, ఆటోలు, ట్రాక్టర్లలో వినాయక విగ్రహాలను తీసుకువెళుతున్నారు. తయారీదారులు రూ.5 వేల నుంచి రూ. 40 వేల వరకు విక్రయాలు జరుపుతున్నారు.

-(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం టౌన్)


అడ్డాల సుబ్బరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆలూరి రామారావు, వీవీ నరసింహారావు, డైరెక్టర్లు, లోటస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దాసరి జగదీష్‌బాబు (కింద)

అడ్డాల సుబ్బరాజు మృతి సొసైటీకి తీరని లోటు

- చైర్మన్ ఆలూరి రామారావు



ఏలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : అడ్డాల సుబ్బరాజు మృతి సొసైటీకి తీరని లోటు అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం అధ్యక్షుడు ఆలూరి రామారావు అన్నారు. సోమవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఎ.ఎస్.ఆర్.నగర్‌లో అడ్డాల సుబ్బరాజు దశదిన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సొసైటీ నూతన అధ్యక్షుడు ఆలూరి రామారావు, కార్యదర్శి వీవీ నరసింహారావు, డైరెక్టర్లు, లోటస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దాసరి జగదీష్‌బాబు పలువురు ప్రముఖులు పాల్గొని సుబ్బరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సొసైటీ అభివృద్ధికి అడ్డాల సుబ్బరాజు ఎంతో కృషిచేసారని, నిత్యం సభ్యులతో మమేకమై సమస్యలు తెలుసుకుని పరిష్కరించేవారన్నారు.

హోంగార్డుపై జనసేన కార్యకర్త దాడి

(5వ పేజీ తరువాయి)

హోంగార్డు ముఖంపై పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డాడు, అడ్డువచ్చిన కానిస్టేబుల్‌ను పరుష పదజాలంతో దూషించాడు. గాయపడిన హోంగార్డును వెంటనే మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. బాధితుడైన హోంగార్డు మోహనరావు ఫిర్యాదు మేరకు మచిలీపట్నం పోలీస్‌స్టేషన్‌లో కర్రి మహేష్‌పై 121(1), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కాగా, ఇటీవల మచిలీపట్నంలోని పోలీస్‌స్టేషన్‌లలో విధుల్లో చేరిన ఇద్దరు మహిళా ఎస్ఐల పట్ల కూడా కర్రి మహేష్ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ అంశాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినట్లు పోలీస్ అధికారులు అంటున్నారు. తరచూ వివాదాలకు కారణమవుతూ జనసేనకు తలవంపులు తెస్తున్న కర్రి మహేష్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, అతని పార్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని కూడా రద్దు చేస్తుస్తున్నట్లు జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ సోమవారం మీడియా సమావేశంలో ప్రకటించారు.

పారదర్శకంగా నిత్యావసరాల సరఫరా

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలో దాదాపు 92 వేల మంది లబ్ధిదారులు స్మార్ట్ కార్డులు పొందనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో మోహన్ బాబు, ఉయ్యూరు ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ గోపాలకృష్ణ, తాడిగడప మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, బండ్రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540



అయ్యప్పస్వామి ఆలయానికి రూ. 5.09లక్షల విరాళం



హనుమాన్‌జంక్షన్,ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు శివాలయం ప్రాంగణంలో నూతనంగా చేపట్టిన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మండల వెంకట సత్యనారాయణమూర్తి, లక్ష్మీరంగ నాయకమ్మ దంపతులు రూ. 5.09 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గూడవల్లి చిన్నాకు ఆ మొత్తాన్ని అందించారు. ఆలయ కమిటీ సభ్యులు గూడపాటి రత్నశేఖర్, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, తదితరులు దాతలను అభినందించారు.



ఉయ్యూరులో పన్ను చెల్లించకుండా పట్టుబడిన సిగరెట్లు

పన్ను చెల్లించని సిగరెట్లు స్వాధీనం

ఉయ్యూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి పన్నులు చెల్లించకుండా షుమారు రూ. 6 లక్షలు విలువచేసే సిగరెట్లను జీఎస్టీ అధికారులు సోమవారం స్వాధీన పరుచుకున్నారు. పన్ను చెల్లించకుండా సిగరెట్లు తీసుకువచ్చి ఆదివారం రాత్రి గోదా ములో నిల్వ చేసినట్టు అందిన సమాచారం మేరకు జీఎస్టీ జిల్లా అధికారి సౌమ్య ఉయ్యూరు చేరుకుని తోట్లవల్లూరు రోడ్డులో జనరల్ మర్చంట్ నంబూరి సుబ్బారావుకు చెందిన గోదాములో తనిఖీ చేయగా ఎటువంటి బిల్లులులేని 30 అట్టపెట్టెల్లో సిగరెట్లు కనుగొని స్వాధీన పరుచుకున్నారు. వీటి విలువ షుమారు రూ. 6 లక్షల రూపాయలు ఉంటుందని ఆమె తెలిపారు. ఉయ్యూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



పోలవరం కాలువ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణమోహన్

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది జరగనున్న గణేష్ నిమజ్జన ఏర్పాట్లను నున్న సీఐ కృష్ణమోహన్ సోమవారం పరిశీలించారు. నున్నలోని పోలవరం కాలువ బ్రిడ్జి ప్రాంతంలో ప్రతి ఏడాది గణేష్ విగ్రహాల నిమజ్జనం జరుగుతుంది. ఈ ఏడాది కూడా అదే ప్రాంతంలో నిమజ్జనానికి సంబంధించి పంచాయతీ ఈవో సురేష్‌బాబుతో చర్చించారు. నిమజ్జనం జరిగే బ్రిడ్జి వద్ద పోలీసు బందోబస్తు, ఫ్లైడ్‌లైట్ల ఏర్పాటు, క్రైన్‌లు అందుబాటులో ఉంచే విషయమై చర్చించారు. అయితే అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాలతో పాటుగా రూరల్ మండలంలోని నున్న, పాతపాడు, తదితర గ్రామాల నుంచి విగ్రహాలు నిమజ్జనానికి రానుండటంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు. టీడీపీ నాయకుడు యార్కారెడ్డి కోటిరెడ్డి పాల్గొన్నారు.

హైవేపై లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి

ఉయ్యూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై ఉయ్యూరు, గండిగుంట వద్ద వీధిలైట్లు వెలిగేలా అధికారులను ఆదేశం చాలని కోరుతూ సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ జాతీయ రహదారుల పీడీతో ఫోన్‌లో మాట్లాడి తగుచర్యలు తీసుకుని లైట్లు వెలిగేలా చూడాలని ఆదేశించినట్టు శ్రీనివాసగౌడ్ తెలిపారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ

ట్రస్టు బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం

ఉయ్యూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సాయిపురంలో స్వయం భూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. చైర్మన్‌గా కోటా రామకృష్ణ, సభ్యులుగా గుండే కోటేశ్వరమ్మ, కె. శ్రీనివాసరావు, జి.వీరశ్రీను, జె.చంద్రమౌళి, కె.నాగజ్యోతి, జె.శివపార్వతి, పి.భవాని చేత ఆలయ ఈవో సాయిబాబు ప్రమాణస్వీకారం చేయించారు. సర్పంచ్ ఎస్.కె.జాన్ బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల వెంకటకుటుంబరావు, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, జబర్లపూడి సర్పంచ్ సూరపనేని శేషవరప్రసాద్, వేమూరు శ్రీనివాసరావు, పంద్రాజు చిరంజీవి, టి. ప్రసాద్ తదితరులు పాల్గొని ట్రస్టుబోర్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె వివాదంపై ఫిర్యాదు

విజయవాడ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : నున్నలో నెల రోజులుగా జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నిర్మాణ వివాదం కలెక్టర్ వద్దకు చేరింది. అనధికారికంగా గ్రామంలోని పటమట బజారులో జరుగుతున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ, విద్యుత్ శాఖ అనుమతులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులు నెల రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం కోసం దిమ్మె ఏర్పాటు చేశారని ఫిర్యాదులో గ్రామస్తులు పేర్కొన్నారు. అప్పటికే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా పక్కనే కాలువపై మరో ట్రాన్స్ ఫార్మర్‌ను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించడంతో హడావుడిగా కొందరు వ్యక్తులు పంచాయతీ అనుమతులు తెచ్చి ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని అధికారులకు వివరించారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి కూడా తీసుకువెళ్లామని అధికారులకు తెలియజేశారు.

జక్కులనెక్కలంలో హెచ్ఐవీపై అవగాహన

గన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జక్కులనెక్కలంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ 2025లో భాగంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ నిస్సి ప్రీతం, లింక్ వర్కర్ మాతంగి సదాలక్ష్మి, ఏఎన్ఎం మార్తమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రసాదంపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా ఫీడర్ విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు ప్రసాదంపాడులోని కొళ్లపారం రోడ్డు, బీఎంపీఎస్ రోడ్డు, పాలబజార్, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయిబాబా టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ పరమేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలి

జేసీ గీతాంజలి శర్మ



పెనమలూరు ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో హేలా షారోన్

పెనమలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : యూరియాను సక్రమంగా పంపిణీ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో యూరియా పక్కదారి పట్టకూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ డీలర్లను ఆదేశించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్, గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పెనమలూరులోని రైతుమిత్ర ఆగ్రో ట్రేడర్స్, పెనమలూరు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని యూరియా తదితర ఎరువుల పంపిణీ రికార్డులను, గోదాముల్లో స్టాకుల స్థితిగతులను పరిశీలించి సంబంధిత డీలర్లను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. తనిఖీలలో గన్నవరం ఏడీఏ సునీల్, తహసీల్దారు గోపాలకృష్ణ, ఏవో శైలజ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

ఉయ్యూరు : యూరియా అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేశ్‌కుమార్ అన్నారు. ఉయ్యూరులో ఎరువుల దుకాణాలను ఇతర శాఖల అధికారులతో కలసి సోమవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉయ్యూరు మండల పరిధిలో యూరియా విక్రయాలకు సంబంధించి నాలుగు కేసులు నమోదు చేశామని, ఏమైన అవకతవకలకు పాల్పడినట్టు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించినట్టు తెలిపారు. మండల ఏవో బి.నిస్సీగ్రేస్, సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే ..

కంకిపాడు : ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులు పాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కంకిపాడు తహసీల్దార్ భవన్నారాయణ హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, పోలీసులతో ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భవన్నారాయణ మాట్లాడుతూ, రైతులు ఎరువుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అవసరమైన రైతులకు ఎరువులు పంపిణీ చేయాలన్నారు. ఏవో ఉషారాణి, ఎస్సై డి. సందీప్ పాల్గొన్నారు.

పక్కదారి పట్టిస్తే..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, అధికధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్) సునీల్ హెచ్చరించారు. పెరికీడు, మల్లవల్లిలో ఎరువుల దుకాణాలు, వీరవల్లి, ఆరుగొలను గ్రామాల్లో పీఏసీఎస్ గోడౌన్‌లను ఎరువులకు సంబంధించిన రికార్డులను సోమవారం సాయంత్రం నుంచి తనిఖీలు నిర్వహించారు. డీటీ రాజేంద్ర, ఏవో రంగనాథ్‌బాబు, హనుమాన్ జంక్షన్ ఎస్సై-2 మూర్తి, వీరవల్లి ఎస్సై శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





ఉయ్యూరు, కంకిపాడులో ఎరువుల దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు.. వీరవల్లిలో గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ



ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందజేస్తున్న మడిచర్ల, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామస్తులు

మా గ్రామాలను నూజివీడులో కలపొద్దు

● ఆర్డీవోకు మడిచర్ల, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామస్తుల వినతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న మడిచర్ల, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాలను మండలం నుంచి విడదీసి నూజివీడు నియోజకవర్గంలో కలపడానికి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు విరమించుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యంకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామసభల్లో కూడా ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారని వివరించారు. మడిచర్ల, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాలకు చెందిన పొలాల సరిహద్దులు కలిసే ఉంటాయని, ఈ మూడు గ్రామాల నుంచే హనుమాన్‌జంక్షన్ మార్కెట్‌కు ప్రతి రోజు టన్నుల్లో కూరగాయల తరలిస్తామని వివరించారు. ఈ గ్రామాలకు చెందిన రెవెన్యూ రికార్డులు కూడా బాపులపాడు మండలంతోనే ముడిపడి ఉన్నాయని, మడిచర్ల, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాలను బాపులపాడు మండలం నుంచి వీడదీస్తే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మడిచర్ల డీసీ చైర్మన్ దేవినేని సత్యనారాయణ, మాటూరి శ్రీనివాస్, పుట్టా సురేష్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పిడికిటి రాంబాబు, బండ్లమూడి కృష్ణ, కొత్తపల్లి టీడీపీ అధ్యక్షుడు వల్లూరిపల్లి నాని, అక్కినేని రవి, పొట్లూరి బెనర్జీ, కోరం రాజు, షేక్ భవాని, మస్తాన్‌వలి, మౌలాలి, షేక్ బడే, తదితర రైతులు పాల్గొన్నారు.

సేవ చేయాలన్న దృక్పథంతో పనిచేయాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్‌పర్సన్‌గా బాధ్యత చేపట్టిన ప్రతి ఒక్కరూ రైతులకు సేవ చేయాలన్న ధృక్పదంతో పనిచేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని గొడవర్రు పీఏసీ ఎస్ చైర్మన్‌గా అన్నే శివరామప్రసాద్, సభ్యులు ఆకునూరు నాగేశ్వరరావు, రావి సుబ్బారావులతో సోమవారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధ్యతలు చేపట్టిన వారు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా రైతులు ఎరువుల సమస్యతో కొట్టుమిట్టాడుతున్నారని, కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొంది శివరామకృష్ణ, సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణ, మాజీ సర్పంచ్ కోనేరు బాను, యార్లగడ్డ బోసు, కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్, మోనటరింగ్ కమిటీ సభ్యులు కొండా నాగేశ్వరరావు, కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, యనమదల వెంకటేశ్వరరావు, మదన్ మోహన్, నాగరాజు, ఏనుగ జయప్రకాష్, వీరంకి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



గొడవర్రు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అన్నే శివరామప్రసాద్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సంక్షేమ పథకాలతో ప్రజారంజక పాలన

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద పీట వేసి ప్రజారంజకంగా పాలనసాగించడం అభినందనీయమని టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు అన్నారు. సోమవారం బాపులపాడులో కూటమి ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్వే డీటీ రాజేందర్, వీఆర్వో గాబ్రియేల్, తదితరులు పాల్గొన్నారు.



బాపులపాడులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

విజయవాడ రూరల్ : అంబాపురంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్న రామారావు, ఆర్ఐ సాయికృష్ణలు కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సాయి, ఉప సర్పంచ్ గజగంటి రాజు పాల్గొన్నారు.

గన్నవరం : పారదర్శకమైన రేషన్ పంపిణీ చేయటమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్ అన్నారు. స్థానిక రేషన్ షాపు పరిధిలో సోమవారం తహసీల్దార్ కేవీ శివయ్యతో కలసి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. టీడీపీ మండల కార్యదర్శి బోడపాటి రవికుమార్, టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యుడు మద్దినేని వెంకటేశ్వరరావు, బుస్సే నాగ ప్రసాద్, తంగిరాల శ్రీనివాస్, మోర్ల నాగబాబు, వేణు పాల్గొన్నారు.

కంకిపాడు : పారదర్శకత పెంచడానికి స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్నామని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. తహసీల్దార్ భవన్నారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సర్పంచ్ బాకి రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, వణుకూరు విక్రమ్, పాల్గొన్నారు.

పెనమలూరు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, పటిష్ఠ సాంకేతికతతో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులను తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర తాడిగడప మునిసిపాలిటీలో పంపిణీ చేశారు. దోనేపూడి రవికిరణ్, వీఆర్వో పాల్గొన్నారు.





గన్నవరం, అంబాపురం, తాడిగడప మునిసిపాలిటీలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎస్.అరుణశ్రీ

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎస్.అరుణ శ్రీ

గన్నవరం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని అటువంటి వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే తగిన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి ఎస్.అరుణ శ్రీ అన్నారు. మండలంలోని కేసరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా న్యాయాధికారి అరుణశ్రీ మాట్లాడుతూ, గ్రామంలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. అవగాహనతోనే బాల్య వివాహాలను అరికట్టవచ్చన్నారు. డీటీ భవాని, సీఐ బీవీ శివప్రసాద్, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, డాక్టర్ మంజూష, ఈవోపీఆర్డీ రాజాబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్‌వి నాగపద్మావతి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, బార్ అసోసియేషన్ కార్యదర్శి రామకూరి ప్రకాష్‌రావు, రామిశెట్టి విమల్‌కుమార్, అమర్తల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద పంచాయితీ కార్యాలయం వద్ద కూడా అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ వేము రాధాకృష్ణ పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పోరంకిలో సీసీ రోడ్డు ప్రారంభం

పెనమలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకి ప్రియాపికిల్స్ మెయిన్‌రోడ్డు సమీపంలో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. రూ. 27.4 లక్షల సీఆర్డీయే నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మునిసిపాలిటీలో దశల వారీగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, తుమ్మలపల్లి హరికృష్ణ, చెన్నుపాటి శ్రీనివాస్, కుర్రా నరేంద్ర, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, సంగెపు రంగారావు, వడ్లమూడి శుభశేఖర్, యాళ్ల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీకి నిధులు జమ చేయండి

పెదపులిపాక సర్పంచి గుంటూరు శ్రీనివాస చౌదరి

పెనమలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీలో పనిచేసిన కార్యదర్శులు పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసి కొన్నేళ్లయినా ఇంతవరకు పంచాయతీకి నిధులు జమచేయలేదని పెదపులిపాక సర్పంచి గుంటూరు శ్రీనివాస చౌదరి సోమవారం కలెక్టరుకు విన్నవించారు. 2019వరకు కార్యదర్శిగా పనిచేసిన ఒక వ్యక్తి, తర్వాత పనిచేసిన మరో వ్యక్తి మొత్తం రూ. 59లక్షలు దుర్వినియోగం చేశారంటూ ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఈ-కార్డులు

● స్మార్ట్‌కార్డులను అందజేసిన మంత్రి నాదెండ్ల మనోహర్

భారతీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో ఈ-కార్డులు తయారు చేశారని, నేడు పండుగ వాతావరణంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4.42కోట్ల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైందని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం విజయవాడ వరలక్ష్మీనగర్, పెనమలూరు సెంటర్‌లో మంత్రి స్వయంగా ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. సెప్టెంబరు 15లోపు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ కార్డుల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 5లక్షల 90వేల మంది లబ్ధిదారులకు, కృష్ణాజిల్లాలో 5లక్షల 17వేలమంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేస్తే లబ్ధిదారుడు ఎప్పుడు సరుకులు తీసుకున్న సమాచారం వెంటనే ప్రభుత్వానికి చేరుతుందన్నారు. కొండప్రాంతాలు, దూరప్రాంతాల వారికి సబ్ రేషన్ డిపోలు ఏర్పాటుచేయడంపై సీఎంతో చర్చ జరుగుతోందని మంత్రి మనోహర్ అన్నారు. కార్డుల్లో మార్పుల, చేర్పులకు స్థానిక సచివాలయాల్లో అప్లై చేసుకోవచ్చునన్నారు. ఏదైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 1967 ద్వారా సంప్రదించవచ్చునన్నారు. ఈ-స్మార్ట్ రైస్ కార్డుల ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా రేషన్ సరుకులు పొందవచ్చునని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్, సివిల్ సప్లై కమిషనర్ సౌరబ్ గౌర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.



వరలక్ష్మీ నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తదితరులు.

దేశవ్యాప్తంగా హమ్ బద్లేంగే క్యాంపెయిన్

కృష్ణలంక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్రరత్నభవన్‌లో సోమవారం 'హమ్ బద్లేంగే' పోస్టరును ఎన్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి ఎం రాజీవ్ గాంధీ, హమ్ బద్లేంగే ఏపీ ప్రోగ్రాం ఇన్‌చార్జి మనీష్ గోవింద రాజ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్ ఆవిష్కరించారు. సోమవారం ఆంధ్రరత్న భవన్‌లో ఎన్ఎస్‌యూఐ ఏపీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో హమ్ బద్లేంగే క్యాంపెయినింగ్ దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోనూ పై తెలిపిన అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేలా రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో విస్తృతంగా 'హమ్ బద్లేంగే' చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు చందు నాయక్, పట్టాభిరామయ్య, మల్లిఖార్జున్, సుబ్బారెడ్డి, ఎస్‌కే కరీం, ఓబులేష్, గణేష్, వీరేష్ యాదవ్, నాగూర్ వలి పాల్గొన్నారు.

భక్తులకే మహామండపం..!

● ప్రస్తుతం అందుబాటులో రెండంతస్తులే ● దసరా నాటికి అన్నదానం, ప్రసాదంపోటు భవనాలు ● ప్రతిపాదనలో కంపార్టుమెంట్లు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: మహామండపాన్ని ఇక నుంచి పూర్తిగా భక్తులకే కేటాయించాలని అధికారులు భావిస్తున్నారా? ఇందులోని అంతస్తులను కంపార్టుమెంట్లుగా మార్పు చేయాలని ప్రణాళికలు రూపొందించబోతున్నారా? మహామండపాన్ని ఉపయోగించాల్సిన విధంగా ఉపయోగించడం లేదన్న భావన అధికారుల్లో ఉందా? అంటే అవుననే సమాధానం ఆలయ వర్గాల నుంచి వస్తోంది. అమ్మవారి ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న తూర్పు రాజగోపురాన్ని అనుసంధానం చేస్తూ నిర్మించిన మహామండపం రూపురేఖలు మార్పు చేయాలన్న యోచనలో అధికారులున్నారు. ప్రస్తుత అవసరాల నిమిత్తం వేర్వేరుగా ఉపయోగిస్తున్న ఈ భవనాన్ని రాబోయే రోజుల్లో పూర్తిగా భక్తులకు కేటాయిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలు చేస్తున్నారు. దానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించడానికి సిద్ధమవుతున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు వేచి ఉండే సమయాల్లో కూర్చోవడానికి వీలుగా కంపార్టుమెంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.



పక్కనే నిర్మిస్తున్న ప్రసాదాల పోటు



శ్రీ మల్లేశ్వర మహామండపం

ఇదీ 'మహా' స్వరూపం

కనకదుర్గానగర్‌లో ఏడంతస్తులతో మహామండపాన్ని నిర్మించారు. మొదటి అంతస్తును రాత్రిపూట నిద్రచేసే భక్తులకు కేటాయించారు. రెండు, మూడు అంతస్తుల్లో అన్నదానం జరుగుతోంది. 4వ అంతస్తులో దేవస్థాన కార్యాలయ కార్యకలాపాలు నడుస్తున్నాయి. ఐదో అంతస్తులో అమ్మవారి నివేదనశాల, పూజాసామగ్రి, చిత్రపటాల దుకాణాలున్నాయి. ఆరో అంతస్తులో కుంకుమ పూజులు, హుండీల లెక్కింపులు జరుగుతున్నాయి. ఏడో అంతస్తు నుంచి తూర్పు రాజగోపురం వద్దకు భక్తులను తీసుకెళ్తారు. మహామండపానికి కుడివైపున మెట్ల నుంచి భక్తులు దర్శనానికి వెళ్తారు. ఎడమవైపున లిఫ్టుల ద్వారా రూ.500 దర్శనం టికెట్లు తీసుకున్న భక్తులను తీసుకెళ్తారు. మహామండపం మొత్తాన్ని పరిశీలిస్తే భక్తులకు తక్కువగానే ఉపయోగిస్తున్నారని తెలుస్తోంది. ఎక్కువ మంది భక్తులు ఘాట్ రోడ్డు మీదుగా దర్శనానికి వెళ్తున్నారు. మామూలు రోజుల్లో భక్తులు అటు ఘాట్ రోడ్డు, ఇటు కనకదుర్గానగర్ వైపు నుంచి దర్శనానికి వెళ్తారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో మాత్రం కనకదుర్గా నగర్ నుంచి భక్తులను దర్శనానికి అనుమతించరు. దర్శనం పూర్తయ్యాక బయటకు పంపుతారు.

ఏం చేయాలనుకుంటున్నారంటే..!

తిరుమలలో సర్వదర్శనం, సుపథం (రూ.300), వీఐపీ బ్రేక్ ఇలా ఏ దర్శనానికి వెళ్లినా భక్తులు కూర్చోవడానికి కంపార్టుమెంట్లు ఉన్నాయి. వాటిలో కుర్చీలుంటాయి. కానీ ఇంద్రకీలాద్రి పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఘాట్ రోడ్డు పై నుంచి వెళ్లినా, మహామండపం మెట్ల నుంచి ఎక్కినా, లిఫ్టుల దగ్గరకు వచ్చినా భక్తులు వేచి ఉండడానికి సదుపాయాలు మాత్రం లేవు. నిత్యం అమ్మవారికి నివేదనలుంటాయి. ఆ సమయంలో ప్రధాన ఆలయంతోపాటు చుట్టుపక్కలున్న పరిసరాలను శుభ్రం చేస్తారు. నివేదన పూర్తయ్యాకే భక్తులను అనుమతిస్తారు. దీంతో అరగంటపాటు దర్శనాలను నిలుపుదల చేస్తారు. అప్పటి వరకు భక్తులంతా క్యూలో నిలబడాల్సి వస్తోంది. దసరాలోని శరన్నవరాత్రుల సమయాల్లోనూ ఇదే పరిస్థితి. మామూలు రోజుల్లో ఆది, మంగళ, శుక్రవారాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పండుగ పర్వదినాల్లోను భారీసంఖ్యలో భక్తులు వస్తారు. మహామండపానికి పక్కనే ప్రసాదాల పోటు, ఎదురుగా అన్నదాన భవనం నిర్మిస్తున్నారు. దసరాలో శరన్నవరాత్రులకు వాటిని ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయ్యాక రెండు, మూడు అంతస్తుల్లోని అన్నదానం కొత్త కాంప్లెక్స్‌లోకి వెళ్తుంది. ఐదో అంతస్తులోని నివేదనశాల, ప్రసాదాల తయారీ మొత్తం పోటు భవనంలో వస్తాయి. 4వ అంతస్తులోని దేవస్థాన కార్యాలయాన్ని జమ్మిదొడ్డిలోని భవనాల్లోకి మార్చాలనే ఆలోచనలో అధికారులున్నారు. దీంతో మూడంతస్తులు ఖాళీ అవుతాయి. వీటిని భక్తులకు కంపార్టుమెంట్లను నిర్మించాలనిప్రణాళికలు తయారు చేయాలని భావిస్తున్నారు.



ఎదురుగా అన్నదాన భవనం

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

● కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మీకోసం అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధపెట్టి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశపు మందిరంలో సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో కే చంద్రశేఖరరావు, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, డీఎస్‌సీ జీ శ్రీనివాసంరావు, ఆర్డీవో కే స్వాతితో కలిసి ప్రజాసమస్యల పరిష్కారవేదిక మీకోసం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత సమయానికి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వివిధ శాఖల్లో పెండింగ్ కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచిస్తూ అవసరమైన వాటికి సకాలంలో కౌంటర్ దాఖలు చేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయటంలో కొన్నిశాఖలు వెనుకబడి ఉన్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులకు అక్టోబరు 2న రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర అవార్డులు అందిస్తుందనీ, ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు పేర్లను ప్రతిపాదించాలని సూచించారు. స్వచ్ఛ పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆసుపత్రులు, బస్టాండ్‌లు, రైతుబజార్లు, వసతిగృహాలు, పరిశ్రమలు వంటి వాటికి మార్కులు కేటాయించి అవార్డులు ఇస్తామని, వాటిని కూడా ప్రతిపాదించాలని సూచించారు. దీనికి జడ్పీ సీఈవో కన్నమనాయుడు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు.



మీకోసం అర్జీలు పరిష్కరించటంపై అధికారులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ బాలాజీ

అధికారులకు కలెక్టర్ అవగాహన

మీకోసంలో ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించే విధానం, వాటిని ఆన్‌లైన్‌లో సమర్పించే ప్రక్రియపై కలెక్టర్ డీకే బాలాజీ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆన్‌లైన్ పోర్టల్ ప్రజెంటేషన్ అవగాహన కల్పించారు. మీకోసం అనంతరం ఆయన అధికారులకు ప్రత్యేకంగా స్క్రీన్‌పై పీజీఆర్ఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రదర్శించి అర్జీదారుడికి పరిష్కారం చూపిన అనంతరం ఆన్‌లైన్‌లో చేపట్టాల్సిన ప్రక్రియను వివరించారు. ప్రతి అధికారి అవగాహన కలిగి, లోటుపాటులను సరిచేసుకుని తప్పులు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, ఆర్ అండ్‌బీ ఈఈ లోకేశ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నటరాజ్, సీపీవో భీమరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహరరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టీ శివరాంప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్.రాణి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

90 శాతం వైకల్యం ఉన్నా కనికరించడం లేదు

తొంభై శాతం వైకల్యం ఉన్నా కనికరించడం లేదని దివ్యాంగురాలు షేక్ ఫైజాస్‌బీ ఆవేదన వ్యక్తం చేసింది. బాపులపాడు మండలం వీరవల్లి నివాసి అయిన ఆమె 2015 నుంచి హోల్ బాడీ మస్క్యులర్ డిస్ట్రోఫీతో ఇబ్బందులు పడుతోంది. కాలక్రమంలో వ్యాధి అధికమై పూర్తిగా మంచానికే పరిమితమైంది. 2015, 2024లో వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్లు 90 శాతం వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్ జారీచేశారు. ఈ ఏడాది జూలై 11న గుడివాడ ఏరియా ఆసుపత్రిలో కేవలం 70 శాతం వైకల్యం ఉన్నట్టు సర్టిఫికెట్ ఇచ్చారు. దీంతో తమ కుమార్తె తీవ్ర అనారోగ్యంతో, నడవలేని స్థితిలో ఉన్నా గుడివాడ ఏరియా ఆసుపత్రి వైద్యుడు ఇచ్చిన నివేదిక ప్రకారం తన కుమార్తెకు నెలకు రూ.15వేల పింఛన్ రాకుండా నిలిచిపోయిందని బాధితురాలి తండ్రి జాన్‌బాషా కలెక్టర్‌కు వివరించారు .గతంలో వైద్యులిచ్చిన సర్టిఫికెట్లను చూపించాడు. నరాల వైద్యుడితో మళ్లీ వైద్య పరీక్షలు చేయించి, ఆయన నివేదిక ప్రకారం తన కుమార్తెకు పూర్తిస్థాయి పింఛను ఇప్పించాలని వినతిపత్రంలో కోరాడు. ఈ బాలిక సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ డీఎంహెచ్‌వోను ఆదేశించారు.

కార్మిక వర్గాల ఐక్యతతో పోరాటాలు

● అఖిల భారత సీఐటీయూ అధ్యక్షురాలు డాక్టర్ హేమలత

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు దేశ వ్యాప్తంగా కార్మిక వర్గాల నేతలందరూ ఐక్యతతో పోరాటాల స్థాయిని పెంచాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కే హేమలత పిలుపునిచ్చారు. సోమవారం మచిలీపట్నం రైల్వేస్టేషన్ దగ్గరలోని శుభ కల్యాణ మండపంలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు అనే అంశంపై డాక్టర్ హేమలత మాట్లాడారు. సీనియర్ కమ్యూనిస్టు నేత ఎస్ ధనుంజయరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ధర్నా చేయాలంటే పోలీసుల అనుమతి అవసరమంటున్నారన్నారు. ఉద్యమాలకు పిలుపునిస్తే నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారన్నారు. మహిళలతో రాత్రిపూట విధులు నిర్వహించేలా ప్రభుత్వాలు జీవో తీసుకురావడం దారుణమన్నారు. విశాఖపట్నంలో అఖిల భారత మహాసభల నిర్వహణకు వేదిక కానుందన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింహారావు మాట్లాడుతూ మచిలీపట్నంలో ప్రజావైద్యశాల నడుపుతున్న డాక్టర్ హేమలత వైద్య వృత్తిని వదిలి తమ ఆస్తులను అమ్ముకుని హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర కమిటీకి సేవలందిస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వై నరసింహారావు, శ్రామిక మహిళల సంఘం కన్వీనర్ పరుచూరి ధనశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా కార్యదర్శి ఏ రమాదేవి, సీఐటీయూ జిల్లా కోశాధికారి బీ సుబ్రహ్మణ్యం, సీఐటీయూ నగర కన్వీనర్ సీహెచ్ జయరావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నేతల జీ కిషోర్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు మచిలీపట్నం నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతు కూలీ సంఘాలు, కౌలు రైతుల సంఘాలు, భవన నిర్మాణ కార్మికులు హాజరయ్యారు. కే మధుసూదనరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ హేమలత

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

● కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు పంచాయతీ అభివృద్ధి సూచికలు పరివర్తనపై నిర్వహించిన జిల్లాస్థాయి ప్రచార కార్యశాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కిందిస్థాయి వరకు అభివృద్ధి జరిగితేనే నిజమైన అభివృద్ధి అని, ఆ అభివృద్ధి ఫలాలు ప్రతి పౌరుడికి అందితేనే అది పరిపూర్ణం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి కొన్ని అభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించి ఉత్తమ మార్కులు సాధించిన పంచాయతీలకు రూ.కోటికి పైగా ప్రోత్సాహక నిధులను మంజూరు చేస్తుందన్నారు. పంచాయతీరాజ్ సంస్థల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణకు గ్రామాల్లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించిన థీమ్‌లను మొవ్వ మండల డిప్యూటీ ఎంపీడీవో పరమాత్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాదులు కలిగిన పంచాయతీ, ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ, బాలిక స్నేహపూర్వక, నీరు సమృద్ధిగల, పచ్చదనం పరిశుభ్రత కలిగిన, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు కలిగిన, సామాజిక న్యాయం సామాజిక భద్రత కలిగిన, సుపరిపాలన కలిగిన, మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ వంటి 9 థీమ్‌లను ఆయన వివరించారు. జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జడ్పీటీసీలు, జిల్లా అధికారులు, డీఎల్‌డీవోలు పాల్గొన్నారు.

29న అమరావతి జాబ్‌మేళా

● 300కి పైగా ఉద్యోగాల భర్తీ

కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో సీఆర్‌డీఏ సౌజన్యంతో ఆగస్టు 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని నాక్ - సీఆర్‌డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుంది. ఈ జాబ్ మేళాలో సెన్స్ సెమీకండక్టర్ అండ్ ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా లిమిటెడ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్సు కో లిమిటెడ్, భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్, బీటెక్, ఎంఎల్‌టీ, బీఎస్సీ, నర్సింగ్, ఏదైనా డిగ్రీ, పీజీ చదివిన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చు. ఎంపికైన అభ్యర్థులకు రూ.17వేల నుంచి రూ.40వేల వరకు వేతనం లభిస్తుంది. కొన్ని ఉద్యోగాలకు అదనంగా ఇన్సెంటివ్‌లు, అలవెన్సులు సైతం లభిస్తాయి. అర్హత కలిగిన అభ్యర్థులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పూర్తి వివరాలకు గ్రామంలోని సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ - 9848424207, శ్రీకర్ - 9963425999 నెంబర్లలో కాల్ చేయవచ్చు. జాబ్‌మేళాలో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు నైపుణ్యం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/లో నమోదు చేసుకోవాలి.

మధురానుభూతులకు సజీవ సాక్ష్యం ఫొటో

● పాత్రికేయ రంగంలో ఫొటో జర్నలిస్టుల పాత్ర కీలకం ● కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి

కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్ ఒక్క క్లిక్‌తో కెమెరాలో బంధించే చాయాచిత్రం వేయి భావాల లాజిక్ అని, ఫొటోలు ఎన్నో మధురానుభూతులకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని, ఫొటో లేని వార్తా పత్రిక వెలుగు లేని దివిటీ లాంటిదని, ఛాయాచిత్రం చూడటంతోనే సగం వార్తా సారాంశం పాఠకులకు అర్థమయిపోతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డీ చక్రపాణి అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డీ చక్రపాణి, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహంతో కలిసి తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ పీ ప్రసాద్ సేకరించిన పురాతన అరుదైన కెమెరాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా ఆర్థిక రంగానికి దాదాపు 67శాతం సేవా రంగం ద్వారా లభిస్తోందని, పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తే సేవా రంగం మరింత పురోగతి సాధించేందుకు వీలుంటుందన్నారు. చాయాచిత్రాల విజ్ఞాన సారథులైన ఫొటోగ్రాఫర్లు భాగస్వాములు కావాలన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డీ చక్రపాణి మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు, ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించేందుకు వివిధ రకాల ఇతివృత్తాలతో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించడం చాలా ఆనందంగా వుందన్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి ఫొటోగ్రఫీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేసి సత్కరించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, స్వచ్ఛాంధ్ర/స్వచ్ఛ ఎన్టీఆర్, యోగాంధ్ర, తల్లికి వందనం/విద్య, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం-2, న్యూస్ ఫొటోలకు సంబంధించి మూడు విభాగాల్లో ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించగా విజేతలకు ప్రతి విభాగంలో ప్రథమ, (రూ.10 వేలు), ద్వితీయ (రూ.7 వేలు), తృతీయ (రూ.4 వేలు) బహుమతులతో పాటు రూ.2 వేలు చొప్పున ఆరుగురికి ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. మెమెంటోలు, శాలువాలతో సత్కరించారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ అసోసియేటెడ్ ప్రొఫెసర్ జీ అనిత, ఎఫ్ఆర్‌పీఎస్ అవార్డు అవార్డు గ్రహీత, సీనియర్ ఫొటో జర్నలిస్టు టీ శ్రీనివాసరెడ్డి, విజయవాడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే రవికుమార్, హిందూ రిటైర్డ్ ఫొటోగ్రాఫర్ సీహెచ్ విజయబాస్కర్, ఆంధ్రజ్యోతి మాజీ సీనియర్ ఫొటో జర్నలిస్టు డీ సీతారాం, ఐ అండ్ పీఆర్ అధికారి కే రవి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లు రూబెన్ బెసాలియల్, వైడీ ఆనంద్, డీఐపీఆర్‌వో కేవీ రమణారావు, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహన్‌రావు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, వివిధ పత్రికలకు చెందిన ఫొటో జర్నలిస్టులు, ఏపీ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్ లక్ష్మీశ, విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణితో బహుమతులు పొందిన 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లు డీ లక్ష్మణ్, బీ సతీష్, చీఫ్ ఫొటోగ్రాఫర్ జీవీ నారాయణ, పీ రాజేష్

మధుమేహులకు ఇన్‌హేలర్‌తో ఇన్సులిన్

డాక్టర్ యలమంచిలి సదాశివరావు

లబ్బీపేట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఇన్సులిన్ ఇంజెక్షన్ల నుంచి త్వరలో విముక్తి లభిస్తుందని, ఇన్సులిన్ సులువుగా తీసుకోగలిగేలా ఇన్హేలర్లు అందుబాటులోకి రానున్నాయని ప్రముఖ డయాబెటాలిజిస్ట్, యలమంచిలి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచిలి సదాశివరావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హోటల్ జీఆర్టీ గ్రాండ్ నందు డాయాబ్ ఎండోకాన్ 2025 సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ మధుమేహ వైద్యం ఆధునికతను సంతరించుకుందని, భయపడాల్సిన అవసరం లేదని, అధునాతన చికిత్సలతో కొత్త వెలుగులు విరబూయిస్తామన్నారు. శరీర బరువును అదుపులో ఉంచుకోవడం ద్వారా మధుమేహన్ని నియంత్రించుకోవడంతో పాటు గుండె జబ్బుల ముప్పు నుంచి కూడా తప్పించుకోవచ్చున్నారు. ఆధునిక వైద్యా విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ప్రతి ఏటా ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈసదస్సులో జాతీయ వైద్య నిపుణులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రముఖ డయాబెటాలజిస్టు డాక్టర్ అమర్ పాల్ సింగ్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం చేశారు. వైడీఆర్ఎఫ్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హిమన యలమంచిలి, సెక్రటరీ ఐశ్వర్య యలమంచి, జాయింట్ సెక్రటరీ అమూల్య యలమంచి పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న డాక్టర్ అమర్‌పాల్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆందోళన

విజయవాడ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లోని ఫీజు రియంబర్స్‌మెంట్ నిధుల వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాని కోరుతూ ఎస్ఎఫ్ఐ నేతలు, విద్యార్థులు నగరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జీవో 77ను వెంటనే రద్దు చేసి పెండింగ్‌లోని ఫీజు రియంబర్స్ నిధుల విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్, ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వర్యం చేస్తున్న 35, 42 జీవోలను వెంటనే రద్దు చేయాలని, అర్హులైన వారికి తల్లికి వందనం నగదు మంజూరు చేయాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశకు వారు వినతిపత్రం అందజేశారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

గుడివాడ - పామర్రు

● గుడ్లవల్లేరు ● నందివాడ ● పెదపారుపూడి ● మొవ్వ



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 540	

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

గుడివాడ రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : గుడివాడ పట్టణ, రూరల్ మండలాల్లోని ఎరువుల హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణాల్లో ఎరువుల నిల్వల్లో కొద్దిమేర వ్యత్యాసం ఉండటం వల్ల తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ యమ్.డి ఉమర్, తహసీల్దార్ కిరణ్, వ్యవసాయ అధికారి అనంతలక్ష్మీ, ఏ.జి రవికుమార్, కానిస్టేబుళ్లు రవిశేఖర్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ ఉమర్

పంచాయితీ చెరువుల బహిరంగ వేలం 28న

గుడివాడ రూరల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : మోటూరు గ్రామపంచాయితీకి చెందిన 8 చేపల చెరువులు మూడెళ్ల కాలవ్యవధికి పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు పంచాయితీ కార్యదర్శి జనార్ధనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఒక్కొక్క చెరువుకు విడిగా రూ.20వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. వేలంపాట నిబంధనలను పంచాయతీ కార్యాలయం పనిచేయు వేళల్లో తెలుసుకొనవచ్చునని కార్యదర్శి ఆయన పేర్కొన్నారు.

మీకోసంలో ఐదు అర్జీలు

గుడివాడ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ పాల్గొని ప్రజల నుంచి గ్రీవెన్స్ అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కర వేదికలో మొత్తం 5 సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, మున్సిపల్ ఇంజనీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, అకౌంట్స్ ఆఫీసర్ జి.టి నాయుడు, మున్సిపల్ మేనేజర్ బి.నిర్మలా కుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వి.యేసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సంపదకేంద్రాన్ని పరిశీలిస్తున్న జి.సుధీర్

చెత్త సంపద కేంద్రం పరిశీలన

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులోని చెత్తనుంచి సంపద తయారీ చేసే కేంద్రాన్ని కృష్ణాజిల్లా ఎస్‌బీఎం రీసెర్చ్ సెంటర్‌కు చెందిన ఇన్వెస్టిగేటర్ జి.సుధీర్ సోమవారం పరిశీలించారు. గ్రామంలో తడి చెత్త, పొడిచెత్తలను ఏవిధంగా సేకరిస్తున్నదీ హరిత రాయబారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని ప్లాస్టిక్ గ్లాసులు, బాటిల్స్‌ను ముక్కలుముక్కలుగా కట్ చేస్తున్న యంత్రం పనితీరును చూశారు. ఇళ్ల వద్ద సేకరిస్తున్న తడి,పొడి చెత్తలను ఇళ్ల వద్దే వేరుచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



దొండపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ముసునూరి రాజేంద్ర ప్రసాద్

గుడివాడ రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సహకార సంఘ వ్యవస్థ ద్వారా రైతులకు చాలా ప్రయోజనాలు, లాభాలు ఉన్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం దొండపాడు వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌గా ముసునూరి రాజేంద్ర ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా మట్టా కాంతారావు, ఉప్పులూరి శోభనాద్రి ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ పీఏసీఎస్ వ్యవస్థ ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకే రుణ వసతి ఏర్పడుతుందని తెలిపారు. ప్రతి రైతుకూ సహకార సంఘాల ద్వారా ఆర్థిక, సామాజిక ప్రయోజనం చేకూర్చటమే తమ ధ్యేయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను బాగా అభివృద్ధి చేయటానికి కృషి చేస్తుందన్నారు. ఏపీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దొండపాడు గ్రామం టీడీపీ కంచుకోటలాంటిదని తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ రెండవ సారి ఎన్నిక కావటం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. అర్హత ఉన్నవారందరికీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నామన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముక్తినేని అమర్ బాబు, వలివర్తిపాడు సాగునీటి సంఘం అధ్యక్షుడు లింగమనేని వీరబవసయ్య, డీసీ అధ్యక్షుడు నూతక్కి కుటుంబరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, పిన్నమనేని బాబ్జీ, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు బూరగడ్డ శ్రీకాంత్, గుంటా కోడూరు, మోటూరు, రామన్నపూడి, వలివర్తిపాడు సహకార సంఘాల అధ్యక్షులు మెరుగుమాల బసవ పున్నయ్య, చీకటి శేషగిరి, సూరపనేని రామకృష్ణ, పంచకర్ల తాతయ్య, .జగన్మోహనరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: కౌతవరం వ్యవసాయ సహకార సంఘానికి బాధ్యతలు చేపట్టిన త్రీమెన్ కమిటీ సంఘ ఖ్యాతిని మరింత పెంచేలా, రైతులకు అండగా నిలవాలని కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అన్నారు. సోమవారం రాత్రి కౌతవరంలోని వ్యవసాయ సహకార సంఘం త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో నెట్టెం రఘురామ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రశంగించారు. తొలుత నూతనంగా నియమితులైన త్రీమెన్ కమిటీ చైర్మన్ గా వడ్లమూడి యుగంధర్, పర్సన్‌లుగా పళ్లెం నరసింహారావు, బ్రహ్మానాయుడు లచే ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. గుడ్లవల్లేరు నుండీ కౌతవరం వరకూ 30 పైగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు.

అనంతరం రఘురామ్ మాట్లాడుతూ నూతన పాలకవర్గం రైతులకు మరింత మేలు కలిగే విధంగా బాధ్యత వహిస్తూ సంఘానికి మరింత ఖ్యాతిని తీసుకురావాలన్నారు.

మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు ఇచ్చే విషయంలో రైతులకు ఏమేరకు ఉపయోగపడాలో ఆవిధంగా రైతులకు సంఘానికి ఒక వారధిలా త్రీమెన్ కమిటీ సభ్యులు ఉపయోగపడాలని అన్నారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపి వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, టీడీపీ గుడ్లవల్లేరు అధ్యక్షులు కొసరాజు బాపయ్యచౌదరి, గుడివాడ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్,జిల్లా బిజెపి అధ్యక్షుడు అట్లూరి దిలీప్‌కుమార్, గుడ్లవల్లేరు మార్కెట్‌కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం డైరెక్టర్ వి.బి.కే.వి. సుబ్బారావు, పాల్గొన్నారు.



కౌతవరం సహకార సంఘ త్రీమెన్ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నెట్టెం రఘురామ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేవీకే ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ సుధారాణి

యాజమాన్య పద్ధతులపై అవగాహన

కూచిపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తల బృందం మొవ్వలో సోమవారం రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో వరిసాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడుల సాధన, రైతు ఉత్పాదక సంఘాల ప్రాముఖ్యత, ఉత్పాదక సంఘాల ఏర్పాటులో రైతులు పాటించాల్సిన అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల కేవీకే ప్రొగ్రామ్ కో-ఆర్డినేటర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తలు నవీన్, రేవతి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుండీలెక్కింపు

పామర్రు: మండల పరిధిలోని ఉండ్రపూడి-పోలవరం అడ్డ రోడ్డు వద్ద వేంచేసి యున్న వీరాంజనేయ దేవస్థానం హుండీ లెక్కింపు ఈ నెల 28న ఆలయ ప్రాంగణంలో దేవదాయ ధర్మదాయ అధికారుల పర్యవేక్షణలో ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నామని ఆలయ అధికారి వీవీ ప్రసాదరావు సోమవారం ఓ ప్రకటనద్వారా తెలియజేశారు. ఆసక్తిగల వారు హుండీలెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు.

దోమల లార్వా నిర్మూలనకు చర్యలు

● పీహెచ్‌పీ వైద్యాధికారి సాయిప్రసన్న

తోట్లవల్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మురుగు కాల్వల్లో గంబూసియా చేపలు వదలగడం వల్ల దోమల ఉత్పత్తిని తగ్గించొచ్చని పీహెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ టి సాయిప్రసన్న పేర్కొన్నారు. మురుగు గుంటలు, చెరువుల్లో దోమల లార్వా నివారణకు జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో సోమవారం గంబూసియా చేపపిల్లలను వదిలారు. వల్లూరుపాలెం, గరికపర్రు, గుర్విందపల్లి గ్రామాల్లోని చెరువులు, మురుగు గుంటల్లో పదివేల చేప పిల్లలను వదిలారు. ఈ చేపలు దోమల గుడ్లను, లార్వాను తినివేస్తాయని, తద్వారా దోమల ఉత్పత్తి తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అమీర్, డాక్టర్ మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ వి మురళీకృష్ణ, డి రత్నం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడివాడ : గంబూసియా చేపలు మస్కిటో ఫిష్ అని,



మురుగుకుంటలో చేపపిల్లలను వదులుతున్న సిబ్బంది

చేపలు దోమ లార్వాని తింటాయని, దోమలు పెరుగకుండా నివారిస్తాయని ఎన్టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ యూనిట్ ఆఫీసర్ కె.పి రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో గల ప్రదేశాలోని నీటి నిల్వగల ఖాళీ ప్రదేశాల్లో దోమల లార్వా నిర్మూలన కోసం గంబూసియా చేపలు వదిలారు. ఈ కార్యక్రమంలో బి.కేశవ రావు, రామకృష్ణ, డబ్ల్యూహెచ్‌ఎస్ వెంకటలక్ష్మీ, సోనీ,పర్వీన్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలి

● టూటౌన్ సీఐ జె.ఆర్.కె హనీష్

గుడివాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : రాబోయే వినాయక నవరాత్రుల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని టూటౌన్ సీఐ జె.ఆర్కె హనీష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో వివిధ మతాల పెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మతాల పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివిధ మతాల పెద్దలు, పీస్ కమిటీ సభ్యులతో సీఐ కొండపల్లి శ్రీనివాస్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మతాల పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు

గుడివాడ :గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వన్



సమావేశంలో మాట్లాడుతున్న టూటౌన్ సీఐ హనీష్

టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసుకుని ఉత్సవాలను నిర్వహించే కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలను తీసుకోవాలని సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న గణేశ్ మండప నిర్వాహకులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

● డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలపై కూడా శ్రద్ధ వహిస్తే ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నందమూరి తారకరామారావు మెమోరియల్ నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల అండర్-14,16 అథ్లెటిక్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో శిక్షణ పొందిన అనేక మంది అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సైతం పొందారన్నారు. తొలుత ఎన్టీఆర్, పర్వతనేని జగన్మోహనరావు విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ పోటీలకు 350మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

మట్టి వినాయకుడినే పూజిద్దాం..

గుడివాడ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) :వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడినే పూజించాలని ట్రాఫిక్ ఎఎస్సై వి.భాగ్యవతి పేర్కొన్నారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎఎస్సై వి.భాగ్యవతి సహకారంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోమవారం స్థానిక ఏలూరురోడ్డులోని టైలరింగ్ స్ట్రీట్‌లో 300 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, సంఘం సభ్యులు వీర్ల వెంకటేశ్వరరావు, తిరుపతయ్య, బత్తుల ప్రసాద్, సతీష్‌కుమార్, శ్రీనివాస్, తాతారావు పాల్గొన్నారు.

స్థానిక గౌరీశంకరపురంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో వినాయకచవితి పురస్కరించుకుని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు, ఎన్‌ఎస్‌ఎస్ సీవో సతీష్‌చంద్ర, కో-ఆర్డినేటర్ జీవన్, సమన్వయకర్త కాసెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తున్న హరికుమార్

దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ

పెదపారుపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చినపారుపూడికి చెందిన కోపూరి మరియమ్మ అనే వికలాంగ మహిళకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతులమీదుగా దివ్యాంగుల బ్యాటరీ ఛార్జింగ్ ట్రై సైకిల్‌ను అందజేశారు. ఎంతోకాలంగా తాను ఇబ్బంది పడుతున్నానని, తన ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

పెదపారుపూడి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యలమర్రులో దారం భాగ్యరేఖకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్న భాగ్యరేఖకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే రూ.25,541లు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా కల్వర్టు నిర్మాణం

నందివాడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నందివాడ నెర్హైల్లి కల్వర్టు కూలిపోవటంతో రెవెన్యూ అధికారులు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశాలతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా తూములు వేసి కల్వర్టు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసినట్లు ఇరిగేషన్ డీఈ భరత్ తెలిపారు. వ్యవసాయానికి నీరు ఇబ్బంది లేకుండా తూములు పెట్టి కల్వర్టునిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల డీసీ ఛైర్మన్ ఏసుబాబు, రాకేష్, గుడివాడ మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవి, ఇరిగేషన్ ఏఈ పవన్, వివిధ శాఖల అధికారులు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన టీడీపీ శ్రేణులు

పెదపారుపూడి: పామర్రు మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్‌గా పెదపారుపూడికి చెందిన చిలకా ఆంజనేయులు ప్రమాణస్వీకారానికి మండలం నుంచి టీడీపీ శ్రేణులు సోమవారం ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, కాటం రాజు, చిలకా ధనరాజ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేషన్ అక్రమాలను నిరోధించడం కోసమే స్మార్ట్‌కార్డులు

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



మహిళలకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావి వెంకటేశ్వరరావు

పామర్రు, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ పంపిణీలో అక్రమాలను నిరోధించడం కోసమే కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రేషన్ స్మార్ట్‌కార్డుల విధానం అమల్లోకి తెచ్చిందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సోమవారం స్థానిక బందరు రోడ్డులోని యడ్ల అప్పారావు రేషన్‌దుకాణంలో రేషన్ వినియోదారులకు నూతన రేషన్ స్మార్ట్‌కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను గుర్తించడం సులభమవుతుందన్నారు. జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, తహసీల్దార్ జి.రవికాంత్, పీడీఎస్ డిప్యూటీ తహసీల్దార్ బండ్రెడ్డి వెంకటరంగారావు, రేషన్‌డీలరు యడ్ల అప్పారావు, టీడీపీ నేతలు పోనిపిరెడ్డి శ్రీహరి, ముడే శంకర్, ఎంపీటీసీ కూనపరెడ్డి సుబ్బారావు, చాట్ల రమేష్, దాలిపర్తిప్రసాద్, అంజిబాబు, వీఆర్వోలు ఉషా, అనిత, పూజిత, ఫణికుమార్, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీని సోమవారం ప్రారంభించామని తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. పెనమకూరు సచివాలయం వద్ద మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఆరేళ్ల క్రితం వివాహమైన ఓ దంపతులకు స్మార్ట్ రేషన్ కార్డుని అందించారు. ఇది మంచి ప్రభుత్వమని శివరామ్ పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెనమకూరులో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న శివరామ్

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలో పలు గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. గుడ్లవల్లేరులో గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, జంగం మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు యెనిగళ్ల నాగేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు రంగబాబుల చేతులమీదుగా పంపిణీ చేశారు. డోకిపర్రులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీరమాచనేని శివప్రసాద్, సర్పంచ్ జి.జ్యోతి, డీసీ వైస్ చైర్మన్ నాగజయరామ్, మార్కెట్ కమిటీ డైరెక్టరు నాగలక్ష్మి, జానీ పంపిణీ చేశారు.

కూచిపూడి : స్మార్ట్‌కార్డుల వినియోగంతో రేషన్ బియ్యం దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చునని మొవ్వ మండల టీడీపీ అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు తెలిపారు. మొవ్వ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. మొవ్వ మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో 38 రేషన్ దుకాణాలకు సంబంధించి 16,221 కార్డులను ఈ రోజు నుంచి పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ మస్తాన్ తెలిపారు. ఎంపీపీ కొండేటి ఇందిర, మొవ్వ పీఏసీఎస్ చైర్ పర్సన్ రత్నగిరిరావు, ఆర్ఐ విజయదుర్గ, పాల్గొన్నారు.

నందివాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రేషన్ కార్డులను రూపు రేఖలు మార్చి స్మార్టు కార్డులుగా ఏర్పాటు చేసి సోమవారం రెవెన్యూ అధికారులు , టీడీపీ పార్టీ నాయకులతో రేషన్ స్మార్ట్‌కార్డులు పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రెవెన్యూ సిబ్బంది, టీడీపీ నాయకులతో కలసి కార్డుదారుని ఇంటింటికి వెళ్లి స్మార్టు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రఘురామరెడ్డి మాట్లాడుతూ మండలంలో నూతనంగా రేషన్ స్మార్టు కార్డు 10,970 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల డీసీ చైర్మన్ బొమ్మనబోయిన ఏసుబాబు, కృష్ణా జిల్లా కళింగి సాధికార కమిటీ అధ్యక్షులు సింగవరపు ప్రభాకర్‌రావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు కురమ శ్రీనివాసరావు, సువారి వెంకట రంగారావు, సర్పంచ్ ఝాన్సీ కుమారి, ఉప్పల వెంకటేశ్వరరావు, వెంకట కృష్ణారావు(బుజ్జిబాబు), సుధాకర్, రవి, యెహోను, సర్వేశ్వరరావు, మోషేదాలయ, వీఆర్వోలు శ్రీనివాసరావు, జగదీష్, పంచాయతీ కార్యదర్శి విమల కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.



డోకిపర్రులో స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెదపారుపూడి: రేషన్ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సేవలు అందిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి పేర్కొన్నారు. సోమవారం వెంట్రప్రగడలో రేషన్ షాపుల్లో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు నూతనంగా ముద్రించిన స్మార్ట్ కార్డులను ఆయన అందించారు. ఏటీఎం కార్డు ఆకారంలో, క్యూఆర్ కోడ్‌తో రూపొందించిన ఈ కార్డులను గ్రామ రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమర్రు సర్పంచ్ అనూష, ఉపసర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ, పెదపారుపూడి, దోసపాడు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు కూచిపూడి సుబ్బయ్య, మునుగోటి సత్యనారాయణ, మాయ విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



మొవ్వలో స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న రామలింగేశ్వరరావు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 540

పీ-4 పథకం విజయవంతం చేయండి : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : విధి, విధానాలను పాటిస్తూ పీ-4 పథకం విజయవంతమయ్యేందుకు మార్గదర్శిలను గుర్తించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో జేసీ గీతాంజలిశర్మతో కలసి పీ-4 పథకం పురోగతిపై సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 53,759 బంగారు కుటుంబాలను గుర్తించి, 48,549 కుటుంబాలను 4,272 మంది మార్గదర్శిలు దత్తత తీసుకునేలా చేశామన్నారు. మార్గదర్శిలపై ఎలాంటి ఒత్తిడి పెట్టవద్దని, స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా చూడాలని అన్నారు. సీపీవో బీమరాజు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, మెప్మా పీడీ సాయిబాబు, మార్క్‌ఫెడ్ మేనేజర్ మురళీకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

పింఛన్లను పునరుద్ధరించాలంటూ దివ్యాంగుల ధర్నా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్‌ను పునరుద్ధరించాలంటూ కలెక్టరేట్ వద్ద సోమవారం దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ గేటు వద్దకు డీఆర్వో కె. చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ వచ్చి దివ్యాంగులతో మాట్లాడారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కృష్ణా జిల్లా కార్యదర్శి ఎన్. సత్యనారాయణ దివ్యాంగుల సమస్యలను వివరించారు. అర్హులైన దివ్యాంగులకు పెన్షన్ రద్దు చేయడం దారుణమన్నారు. అంతేకాకుండా దివ్యాంగులు రిజర్వేషన్లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. _ అధికారులు పునరాలోచించి దివ్యాంగులకు న్యాయం చేయాలని కోరారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రజక సంఘం నాయకులు

రజక సొసైటీలను పునరుద్ధరించాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రజక సొసైటీలను పునరుద్ధరించాలని, ప్రతి సొసైటీకి రూ.10 లక్షల రుణం మంజూరు చేయాలని, రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాటూరి నాగభూషణం డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేసి ధర్నా నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు అవనిగడ్డ రజనీకాంత్ మాట్లాడుతూ, జీవో 343 ప్రకారం చెరువులు, దోబీ ఘాట్‌ల హక్కు రజకులకే కల్పించాలన్నారు. డిమాండ్ చేశారు. తెలంగాణా ప్రభుత్వం మాదిరిగా రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ప్రతి మండలంలో జూనియర్ కళాశాలలు ప్రారంభించాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మండలంలోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, మహేష్ మాట్లాడుతూ, రీయింబర్స్‌మెంట్ రూ.6400 కోట్లు విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు రూ.3 వేలు పెంచాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కె.కొత్తపాలెం విద్యార్థులు

మోపిదేవి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కె.కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు జి.కృష్ణ ప్రసాద్ తెలిపారు. బాలికల విభాగంలో మత్తి రేష్మ, పూషడపు జాహ్నవి, బాలుర విభాగంలో బోట్ల దివ్యతేజ, తూము లలిత్ మణికంఠ, కొక్కిలిగడ్డ బాబు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. సెప్టెంబరు 22, 23, 24వ తేదీల్లో విశాఖపట్నం జిల్లా వాల్తేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామోపాధ్యాయులు గరికపాటి మారుతిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ మత్తి నాంచారయ్య, పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ యార్లగడ్డ శ్రీనివాసరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ బొమ్మసాని రాంప్రసాద్, గ్రామసర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి అభినందించారు.





సాలెంపాలెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులను సత్కరిస్తున్న కూటమి నాయకులు

రైతులకు మెరుగైన సేవలందించాలి

కోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. సాలెంపాలెం, కోడూరు పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్లు కొప్పనాతి సత్యనారాయణ, పూతబోయిన కరుణ కుమార్, సభ్యులు మెండు బ్రహ్మయ్య, కొక్కిలిగడ్డ వరప్రసాద్, పూతబోయిన శ్రీనివాసరావు, మల్లా వెంకటేశ్వరరావు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దివి మార్కెట్ యార్డు చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు నేతృత్వంలో వారికి ఘనంగా సత్కరించారు. బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, యాసం చిట్టిబాబు, వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ సీఈవో రమేష్, సత్యనారాయణ, నగరాయులు, వివిధ పీఏసీఎస్‌ల అధ్యక్షులు, పాల్గొన్నారు.

విశ్వనాథపల్లిలో : విశ్వనాథపల్లి సొసైటీ వద్ద విశ్వనాథపల్లి పీఏసీఎస్ చైర్మన్ తోట సాంబశివరావు, సభ్యులు కైతేపల్లి పానకాలరావు, విశ్వనాథపల్లి వేణు ప్రమాణ స్వీకారం చేశారు.



ఉత్సవ కమిటీల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై గణేష్‌కుమార్

గణేష్ ఉత్సవ కమిటీలు నిబంధనలను పాటించాలి

బంటుమిల్లి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి) : గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై గణేష్‌కుమార్ అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజేలు ఏర్పాటు చేయరాదని, అశ్లీల నృత్యాలు, రికార్డింగు డ్యాన్సులు ఏర్పాటు చేయరాదని, మతపరమైన సమస్యలు రాకుండా చూడాలన్నారు. నిమజ్జన సమయంలో మద్యం తాగి, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించరాదన్నారు. ఘర్షణలకు తావు లేకుండా శాంతియుతంగా ఉత్సవాలు ముగించాలన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, దాత ప్రెస్ పూర్ణ



వి.కొత్తపాలెంలో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి

ఎంవీకే ఆదర్శాలను కొనసాగించాలి

● శతజయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మండలి

చల్లపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు(ఎంవీకే) ఆదర్శాలను కొనసాగిస్తూ నేటితరం ప్రజలకు సేవలందించాలని శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి ఏటీ ఎం సెంటరులో శివజ్యోతి ప్రింటర్స్ అధినేత అనుముకొండ పూర్ణచంద్రశేఖరరావు ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సభ సోమవారం నిర్వహించారు. మండలి శతజయంతి సంవత్సరంలో పాత తరానికీ, నేటి తరానికి వారధిగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండటం ఎంతో సంతోషమన్నారు. అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరుపెట్టడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. చల్లపల్లి గ్రామంతో తన తండ్రి కృష్ణారావుకు ఎంతో అనుబంధం ఉందన్నారు. నాడు ముఖ్యమంత్రులుగా ఉన్న జలగం వెంగళరావు, పివి.నరసింహారావు, గవర్నర్ కుముద్‌బెన్ జోషిలను మండలి కృష్ణారావు చల్లపల్లి తీసుకువచ్చి కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా కాకుండా, సామాన్య నాయకులు చట్టసభలకు వెళ్లగలిగే పరిస్థితి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, అందుకు శతజయంతి ఉత్సవాలు దోహదపడితే సార్థకత చేకూరినట్లేనని తెలిపారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్ అధ్యక్షతన జరిగిన సభలో యువనేత మండలి వెంకట్రామ్, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సీఐ కె.ఈశ్వరరావు, విశ్రాంత ఈవో ఆర్డీ దాని సీతారామరాజు, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, షేక్ నబీషేహరి, నేతలు పిండి రేవతి, అడపా గురవయ్య, ముమ్మనేని నాని, అడపా రాంబాబు, బోలెం నాగమణి, బొందలపాటి వీరబాబు, గంగిశెట్టి రాజేంద్ర, రావి చిట్టి, కొడాలి మురళి, ఎం.రంజిత్‌కుమార్, ఈవో పివి.మాధవేంద్రరావు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, రిక్షా కార్మికులకు టార్పలను పంపిణీ చేశారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

కోడూరు : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం, మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా వి.కొత్తపాలెం జడ్పీ హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను బుద్ధప్రసాద్ ప్రారంభించారు. ఎంఈవో టివిఎం.రామదాసు మాట్లాడుతూ సుమంత్ ఎంటర్ ప్రైజస్ ఎండీ కెవిబి.రామమోహన్ క్రీడాభివృద్ధికి రూ.50 వేలు, పోటీల నిర్వహణకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారన్నారు. దాతలను ఎమ్మెల్యే చేతులమీదుగా ఘనంగా సత్కరించారు. గ్రామ ప్రముఖులు రేపల్లె రాజేశ్వరరావు, ఎంపిటిసి ముక్కు వెంకటేశ్వరరావు, టిసి అధ్యక్షులు రేపల్లె రవీంద్ర, ననకా శ్రీకాంత్, ఎస్ఎంసీ చైర్మన్ విస్సంశెట్టి సుమతల, హెచ్ఎం చెన్నా దుర్గా ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ఉండాలి

అవనిగడ్డ : నేత్రదానంపై యువతలో మరింత అవగాహన పెంపొందాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎస్‌వీఎల్ కళాశాలలో అవనిగడ్డ ప్రెస్ క్లబ్, సుదర్శి మానవతా సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నేత్రదానం, అవయవ దానంపై అవగాహన పెంపొందించటం ద్వారా అంధత్వాన్ని నివారించటం సాధ్య పడుతుందని తెలిపారు. సుదర్శి సేవా సంస్థ నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 250 జతల నేత్రాలను సేకరించి దాదాపు 1000 మందిని అంధత్వం నుంచి కాపాడామని తెలిపారు. ఎస్‌వీఎల్ కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పుట్టి శ్రీనివాసరావు, అప్పికట్ల శ్రీనివాసరావు, ఇమ్మిడిశెట్టి వెంకట్, ప్రిన్సిపల్ ఎస్.వి.నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వనజాక్షి

ఎరువుల దుకాణాల తనిఖీ

చల్లపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం చల్లపల్లిలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసింది. లైసెన్సులు, గోడౌన్‌లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా, అనధికారంగా నిల్వ చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ డి.వనజాక్షి, ఏవో కె.మురళీకృష్ణ, ఎస్సై పిఎస్‌వి. సుబ్రహ్మణ్యం తనిఖీ బృందంలో ఉన్నారు. **పెడన :** పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రిజిష్టర్లు, బిల్లు పుస్తకాలను తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో ఎస్. జెస్సీ, ఇన్‌చార్జి తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్‌కుమార్, ఎస్సై జి. సత్యనారాయణ, ట్రైనీ ఎస్సై నాగరాజు, విజిలెన్స్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ జయప్రద అన్నారు. మండల వ్యాప్తంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. సరైన రికార్డులు నిర్వహించకపోవడంతో దాదాపు 17.88 లక్షలు విలువ కలిగిన 49 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు ఏడీఏ తెలిపారు. సీఐ యువకుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.శ్రీధర్ తనిఖీల్లో పాల్గొన్నారు.



ఎంపీ బాలశౌరిని సత్కరిస్తున్న పట్టాభి భవన కమిటీ నేతలు

ఎంపీ బాలశౌరికి సత్కారం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ వల్లభనేని బాలశౌరి రుణాన్ని తీర్చుకోలేమని పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి పి.వి. ఫణి కుమార్ అన్నారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలసి పి.వి. ఫణికుమార్ తదితరులు ఘనంగా సత్కరించారు. ఏఆర్‌కే మూర్తి, మోపర్తి సుబ్రహ్మణ్యం, వి.ఎస్ఎస్.ఆర్. శర్మ, వేము కోటేశ్వరరావు, అమర్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, వేమూరి నాగసాయిశర్మ, సూరిశెట్టి హరికృష్ణ, వడ్లమన్నాటి మారుతీ దివాకర్, కానుకొలను ఫణికిరణ్, వై. శివశర్మ, చోడవరపు లక్ష్మీప్రసూన, అంబటిపూడి నాగలక్ష్మి, సర్వా లలితకుమారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగిత చొరవతోనే అభివృద్ధి

బంటుమిల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ చొరవతో నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తోందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, డీసీ చైర్మన్ బొర్రా కాశీ, పీఏసీఎస్ అధ్యక్షుడు గంధం సత్యనారాయణ, భూపతి రమేష్, ఆకునూరి రత్నకుమార్, ఎండీ నూర్. నజీర్, తాతా రాజారావు తదితరులు పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుతో మాట్లాడారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌పై వైసీపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నియోజకవర్గంలో రూ.64 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. టీడీపీ క్రమశిక్షణ, సంస్కారం ఉన్న పార్టీ అన్నారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు.

సాయికృష్ణ భౌతికకాయానికి ఎమ్మెల్యే మండలి నివాళి

నాగాయలంక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : వక్కపట్లవారిపాలెం గ్రామానికి చెందిన డీసీ మాజీ చైర్మన్ అంబటి లక్ష్మణప్రసాద్ అల్లుడు వక్కపట్ల సాయికృష్ణ (40) ఆదివారం హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు పిల్లలు. సోమవారం మృతదేహాన్ని వక్కపట్లవా రిపాలెం తీసుకువచ్చారు. సాయికృష్ణ పార్థివదేహాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు తదితరులు సాయికృష్ణ భౌతికకాయానికి నివాళులర్పించి లక్ష్మణ్ ప్రసాద్ కుటుంబసభ్యులకు తమ సంతాపాన్ని తెలియజేశారు.

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

నాగాయలంక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రేమాలవారిపాలెం గ్రామానికి చెందిన రేమాల పోతురాజు కుమార్తె మూడో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతోంది. టీసీ నేత చెన్ను రంగారావు స్పందించి హైదరాబాద్‌కు చెందిన ఎన్ మాక్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్ నుంచి రూ.10 వేలు, గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఇండస్ట్రీ రూ.5 వేలు, పిడుగురాళ్లకు చెందిన జానకిరామ్ నుంచి రూ.5 వేలును సేకరించి తన వంతుగా రూ.5 వేలు కలిపి రూ.25 వేలు చెక్కును కళాశాల ఫీజు నిమిత్తం పోతురాజుకు అందించారు. వైస్ ఎంపీపీ నాగ ప్రసాద్, పాపారావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ



గూడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గూడూరు పశువుల ఆసుపత్రిలో 50 శాతం సబ్సిడీపై ఎస్సీ రైతులకు గురువారం దాణాను ఎంపీపీ సంగా మధుసూధనరావు పంపిణీ చేశారు. వార్డు సభ్యులు లింగం విజయకుమార్, పశువైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.



పేద విద్యార్థి చదువుకు రూ.40వేలు విరాళం అందజేస్తున్న మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

పేద విద్యార్థికి మానవత ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులను ఆదుకోవడంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ముందుంటుందని మునిసిపల్ మాజీ చైర్మన్, మచిలీపట్నం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. సన్‌స్టార్ స్కూల్‌లో సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ కోర్సులో చేరిన పేద విద్యార్థి కోమటి వెంకట విఘ్నేష్‌కు రూ.40 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా విద్యానిధి కన్వీనర్ పి.శ్రీరాం మాట్లాడుతూ, పేద విద్యార్థులను ఆదుకునేందుకు రూ.50 లక్షలు నిధులు సేకరిస్తున్నామన్నారు. చిలకలపూడి సీఐ నబీ మాట్లాడుతూ, ప్రతిభకు పేదరికం అడ్డుకాదన్నారు. ఆర్డీవో కార్యాలయం ఏవో వై రంగారావు, మానవత జిల్లా ప్రతినిధి అశోక్ కుమార్, స్టార్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వినతిపత్రం అందజేస్తున్న ఎడ్లంక ప్రజలు

శాశ్వత పునరావాసం కల్పించండి

అవనిగడ్డ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా వరదల కారణంగా తరచూ ముంపుకు గురై ప్రమాదకర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఎడ్లంక వాసులకు శాశ్వత పునరావాసం కల్పించాలని పలువురు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన 81 మంది ఇప్పటికే గ్రామం కోతక గురవుతున్నందున త్వరలోనే తమ ఇళ్లు నదిగర్భంలో కలిసేపోయే పరిస్థితి ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని తమకు ముంపు లేని చోట్ల శాశ్వత పునరావాసాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 81 కుటుంబాలు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుకు శాశ్వత పునరావాసం కోసం అర్జీలు సమర్పించగా, ఈ కార్యక్రమానికి మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్ నేతృత్వం వహించారు. కృష్ణానది వరద కోత నుంచి గ్రామాన్ని రక్షించాలని కోరుతూ పాత ఎడ్లంక వాసులు చేస్తున్న నిరసన దీక్ష సోమవారం నాటికి నాల్గవ రోజుకు చేరుకుంది.

మృతదేహం తీసుకురావడానికి ఇబ్బందే

పాత ఎడ్లంక గ్రామానికి చెందిన తెనాలి భాగ్యం (55) సోమవారం బందరు ప్రభుత్వాసపత్రిలో మృతి చెందింది. మృతదేహాన్ని గ్రామంలోకి తీసుకువచ్చేందుకు గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. పడవలో శవపేటికలో తీసుకొచ్చి దహనం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్థులు ఇంత ఇబ్బందులు పడుతున్నా పాలకులు స్పందించకపోవటం దురదృష్టకరమని వాపోతున్నారు.

బిందేశ్వర ప్రసాద్ సేవలు చిరస్మరణీయం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : సంఘసంస్కర్త, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బీసీల ఆరాధ్యదైవం బిందేశ్వర ప్రసాద్ మండల్ సేవలు చిరస్మరణీయమని జిల్లా బీసీ సంక్షేమ సంఘ నాయకుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం అన్నారు. వలందపాలెంలో బిందేశ్వర ప్రసాద్ మండల్ జయంతి ఘనంగా నిర్వహించారు. భోగిరెడ్డి దుర్గాప్రసాద్, నిక్కు రాధాకృష్ణ, ధనికొండ చిన్ని, బెల్లంకొండ రవి, ఎం. రాజు, అన్సారీ, సుభాని, గోపీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. **కోడూరు :** ఐదో వార్డులో బీపీ మండల్ చిత్రపటానికి మండల బీసీ సంఘం అధ్యక్షుడు కొండవీటి సురేష్, అద్దంకి పాండురంగారావు, ఉప్పు చిన్న వెంకటేశ్వరరావు, బత్తుల శ్రీహరి, కాగిత రామారావు, కోట సత్యనారాయణ, కొండవీటి రామకృష్ణ, పెద్ది బాబురావు, పిల్లి మల్లిఖార్జునరావు, మల్ల వెంకటేశ్వరరావు, దావు మల్లి, టీఎస్ఆర్ గ్రూపు సభ్యులు నివాళులర్పించారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభం



బంటుమిల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : ముంజులూరులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. కూనపరెడ్డి వీరబాబు తదితరు నాయకులు పాల్గొన్నారు. **చల్లపల్లి, :** క్యూ ఆర్ కోడ్ ఆధారిత కొత్త రేషన్ కార్డుల పంపిణీ ని తహసీలార్ డి.వనజాక్షి సోమవారం ప్రారంభించారు. పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు, డీటీ శ్రీలత, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీ ఆర్వో శ్రీనివాసరావు, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు. **ఘంటసాల :** కొడాలి సచివాలయం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి నాగమణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.